J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 30 27.12.2024, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




• పుష్ప.. ది పొలిటికల్ ఫైర్

# రక్తి కడుతున్న రాజకీయ సినిమా!



- పుష్ప-2 బెనిఫిట్ షో ఘటనలో రోజుకో మలుపు
- ముదురుతున్న 'పుష్ప' విలాపం
- బాధిత కుటుంబానికి 2 కోట్ల విరాళం

*రాజకీయాలు, క్రికెట్, సినిమా ఈ మూడు విభాగాలు మన దేశంలో అత్యంత పాపులర్ రంగాలుగా గుర్తింపు పొందాయి. ఈ రంగాల్లోని వారు ఏం చేసినా.. ఏం మాట్లాడినా క్షణాల్లో వైరల్ అవుతాయి. ఆయా రంగాల వారు ఎక్కడికెళ్లినా సెలబ్రెటీలుగా వెలిగిపోతుంటారు. స్టార్ స్టేటస్‌ను ఎంజాయ్ చేస్తుంటారు. ముఖ్యంగా రాజకీయ, సినిమా రంగాలవారికి మన రెండు తెలుగు రాష్ట్రాలలో క్రేజ్ ఎక్కువ. అలాంటిది.. ఈ రెండింటికి చెందిన ప్రముఖులే నువ్వా-నేనా అనే స్థాయిలో ప్రత్యర్థుల పాత్ర పోషిస్తే.. ఒకరిపై ఒకరు వాగ్బాణాలు విసురుకుంటే.. ఒకరి లోపాలను ఒకరు ఎత్తి చూపుకుంటే.. ఒకరి గుట్టును మరొకరు బట్టబయలు చేస్తుంటే ఆ కథే వేరు. అది పూర్తి నిడివి యాక్షన్ సినిమాకు ఏమాత్రం తగ్గదు.*

పుష్ప-2 సినిమా బెనిఫిట్‌షో సమయంలో హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందడం, ఆమె కుమారుడు అత్యంత తీవ్రంగా గాయపడడం మనకి తెలిసిందే! అయితే ఘటనపై తెలంగాణ పోలీసులు కేసులు నమోదు చేయడం.. ఏకంగా ఆ సినిమా హీరో అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆ తర్వాత 24గంటల్లోనే జైలు.. మధ్యంతర బెయిలు.. క్వాష్‌పిటీషన్లు దాఖలు కావడం.. ఆపై జైలు నుంచి విడుదలైన హీరోకు

10లో

• శ్రీవారి సేవకులలో.. భక్తి నాస్తి - అహం జాస్తి

# వెంకన్న భక్తులకు.. 'కొండ'ంత కష్టం

## ఏడుకొండలపై ఆధ్యాత్మిక క్షోభ



- భక్తులకు కొందరు టీటీడీ సిబ్బంది నుంచి తరచూ ఛీత్కారాలు
- క్షణమైనా స్వామిని దర్శించుకోకముందే కదలండి.. వెళ్ళండి అంటూ గగ్గోలు

కలియుగ వైకుంఠం తిరుమలలో అణువణువూ అత్యంత పవిత్రం. వేయినామాల స్వామి కొలువైన ఈ మహాకొండల్లో ప్రతిపుట్టా, ప్రతి చెట్టూ శ్రీవారి సేవకే అంకితం. జన్మలో ఒక్క సారైనా ఆ వేంకటనాథుడిని నేరుగా దర్శించి తరించాలని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు నిత్యం ఆరాటపడుతుంటారు. ఇందుకోసం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వారు తిరు నగరికి చేరుకుంటారు. ఇక భారత్‌లో అయితే కశ్మీరు నుండి కన్యాకుమారి వరకు.. గుజరాత్ నుంచి అస్సాం దాకా.. దాదాపూ అందరూ శ్రీవారి భక్తులే అంటే అతిశయోక్తి కాదు. కేవలం హిందువులే కాకుండా స్వామి వైశిష్ట్యాన్ని, ఆధ్యాత్మిక నగరి అయిన తిరుపతి పవిత్రతను నమ్మే ఇతర మతస్తులు కూడా వేంకటాచలానికి వస్తుంటారు. స్వామికి తలనీలాలు సమర్పించడంతో పాటు పుణ్యతీర్థాలను దర్శించి మొక్కులు తీర్చుకుంటారు. ఇక స్వామి సేవలో పాల్గొనేందుకు కొన్ని నెలల ముందే ప్రణాళికలు రచించే వారూ కోకొల్లలు. ముఖ్యంగా ఆంధ్రాతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రా ల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు రోజుల తరబడి గోవింద మాల ధరించి స్వామిదర్శనం కోసం పాద యాత్రలు కూడా చేస్తారు.

తిరుమలపై ప్రత్యేక కథనం 12లో..










# వివేకా..ఓ చెరగని సంతకం



నెల్లూరు అభివృద్ధికి, రాజకీయాలకు సంబంధించి తన సోదరుడు, సింహపురి ముద్దుబిడ్డ ఆనం వివేకానందరెడ్డి..ఓ చెరగని సంతకమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 23న వివేకా 75వ జయంతిని పురస్కరించుకుని నెల్లూరులోని తమ నివాసంలో ఆయన వివేకా చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వివేకాతో నెల్లూరుకు ఉన్న ఆత్మీయతానుబంధాన్ని వివరించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ జనం కోసం పనిచేసిన జననేత వివేకా అని, నెల్లూరు ఎమ్మెల్యేగా నెల్లూరు అభివృద్ధికి ఆయన నిరంతరం పనిచేశారని, ఆయన లేక పోవడం తనకు, తన కుటుంబానికి తీరని లోటని మంత్రి ఆవేదన చెందారు. నెల్లూరు ప్రజానీకంతో ఆయనకున్న అనుబంధం వెలకట్టలేనిదన్నారు. తమ ఉన్నతికి కారణమైన అన్న వివేకాని నిత్యం స్మరించుకుంటూ, వారు చూపిన బాటలో పయనిస్తూ ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తామని ఆయన అన్నారు. మంత్రి ఆనంతో పాటు, ఆయన కుటుంబసభ్యులు, ఆనం అభిమానులు పాల్గొన్నారు.

## కొండ బిట్రగుంటకు..
# ప్రతి శనివారం ప్రత్యేక బస్సు



జిల్లాలోని ప్రాచీనమైన శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రం.. కావలికి సమీపంలోని కొండబిట్రగుంటలో ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్ళాలంటే.. ఎంతో కాలంగా బస్సు సదుపాయం లేక భక్తులు ఇబ్బందులు పడుతుండేవారు. కావలి బీజేపీ నాయకులు ఆ సమస్యను ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి తెలియ జేయడంతో, ఆయన వెంటనే స్పందించి బిలకూటక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఆ ఆలయం వద్దకు కావలి నుంచి ప్రత్యేకబస్సును నడిపేందుకు ఆర్టీసీ అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రత్యేక బస్సు ఏర్పాటుకావడంతో బీజేపీ నాయకులు సంతోషపడుతూ, ఈనెల 23న సన్నపురెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ కావలి పట్టణశాఖ అధ్యక్షుడు కె.బ్రహ్మానందం, నాయకుడు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. భక్తులు ఈ ప్రత్యేక బస్సు సదుపాయాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.


## ప్రేమ, దయతో జీవించడమే..
# క్రీస్తు బోధనల సారాంశం

• ప్రీ-క్రిస్మస్ వేడుకల్లో వక్తలు




ప్రతిఒక్కరూ ప్రేమ, దయ, ఓర్పు, సహనం, నీతి, ధర్మం వగైరా దేవుని లక్షణాలను కలిగి ఉండాలని, అందరూ ఐక్యతతో, కరుణతో జీవించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ చెప్పారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఈనెల 23న కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బిషప్ ఎం.డి ప్రకాశం తదితరులతో ముందస్తు వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న బిషప్ ఎం.డి ప్రకాశం మాట్లాడుతూ, దైవలక్షణాలతో జీవితం సాగించేందుకు ఏసుక్రీస్తు బోధనలను ఆచరించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, ప్రభుత్వానికి, ప్రజలందరికీ ఏసుప్రభువు దీవెనలుండాలని ప్రార్థించారు. తొలుత క్రిస్మస్ ట్రీని ఆవిష్కరించారు. అనంతరం పేదలకు నూతన వస్త్రాలు బహూకరించారు. నగర మేయర్ స్రవంతి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రఘు, పాస్టర్లు దయాసాగర్, ఎలీషాకుమార్, సురేంద్రబాబు, శోభన్‌బాబు, క్రాంతికుమార్, ప్రభుకుమార్, బర్నబాస్, పాల్‌కోటి, కెవెస్ రాజు, హనోక్ తదితరులు పాల్గొన్నారు.

## 'సమగ్ర శిక్ష' ఏపీసీగా
# వెంకటసుబ్బయ్య



జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అదనపు కోఆర్డినేటర్ (ఏపీసీ)గా ఉదయగిరిలో అధ్యాపకునిగా పనిచేస్తున్న వెంకటసుబ్బయ్య నియమితులయ్యారు. ఇటీవల ఏపీసీగా నెల్లూరులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విద్యాశాఖ, సమగ్రశిక్ష ప్రాజెక్టు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు.

## చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న..
# ప్రముఖ దర్శకుడు కోదండరామిరెడ్డి



ఇందుకూరుపేట మండలం గంగపట్నంలో వెలసివున్న శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారిని ప్రముఖ దర్శకుడు ఏ.కోదండరామిరెడ్డి ఈనెల 23న దర్శించుకుని పూజలు చేశారు. తన స్వగ్రామమైన గంగపట్నంకు రావడం, అమ్మవారిని దర్శించుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. తొలుత, ఆలయ ఇఓ తాతా శ్రీనివాసరావు, అర్చకులు, సిబ్బంది ఆయన్ను సాదరంగా స్వాగతించారు.

## 62 మందికి..
# ఉద్యోగాలొచ్చాయి

నెల్లూరులోని డీకేడబ్ల్యు కళాశాల, ప్రభుత్వ బాలుర ఐటీఐలలో ఈనెల 23న జరిగిన జాబ్‌మేళాల్లో 62మందికి ఉద్యోగాలొచ్చాయి. డీకేడబ్ల్యు కళాశాల జాబ్ మేళాలో 39 మంది, ఐటీఐ జాబ్‌మేళాలో 23 మంది పలు ఉద్యోగాలకు ఎంపిక య్యారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి అబ్దుల్‌ఖయ్యూం, డీకేడబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ గిరి, ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, స్కిల్‌హబ్ ఇన్‌చార్జిలు ఉమాసుమాలిని, శ్రీధర్, హేమంత్‌ల ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళాలు జరిగాయి.

# ఎన్‌బికెఆర్‌లో ఖోఖో టీమ్‌కు శిక్షణ



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 20 నుంచి దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల ఖోఖో క్రీడాపోటీల్లో పాల్గొనే జట్టుకు శిక్షణ ఇచ్చారు. జెఎన్‌టియుఏ విశ్వవిద్యాలయానికి చెందిన 5 ఉమ్మడి జిల్లాల నుండి జట్టు ఎంపిక జరిగింది. ఈనెల 27వ తేదీ మద్రాసులోని సెంట్రల్ యూనివర్శిటీలో ఈ పోటీలు జరుగనున్నాయి. ఆ జట్టుకు కోచ్‌గా పి.రాముకుమార్ వ్యవహరిస్తున్నారు. ఈ జట్టులో ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి శ్రవణ్‌కుమార్, అలెక్స్, చందు కూడా పాల్గొంటున్నారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రీడాదుస్తులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి అందజేసి, వారికి శుభాకాంక్షలు చెప్పారు.

# విజయ డెయిరీకి మరో ఇద్దరు డైరెక్టర్లు



నెల్లూరులోని విజయ డెయిరీలో ఖాళీగా ఉన్న రెండు డైరెక్టర్ల పోస్టులను ఈనెల 23న నిర్వహించిన డెయిరీ సర్వసభ్య సమావేశంలో భర్తీ చేశారు. వరిగొండ, తిరుమలపూడిలకు చెందిన పాలసొసైటీ సభ్యులు జలదంకి హరికృష్ణారెడ్డి, తాళ్ళూరు బాలునాయుడులను డైరెక్టర్లుగా ఎంపిక చేసుకున్నారు. అనంతరం వారిని సన్మానించి అభినందించారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ కార్యవర్గం



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారు ఈనెల 22న ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో 2025 సంవత్సరానికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శిగా గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారిగా మాగంటి ప్రసాద్, గౌరవాధ్యక్షునిగా తలపనేని హరిబాబు ఎన్నికయ్యారు. వినుకొండ వెంకటేశ్వర్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, వాకర్స్ ఇంటర్నేషనల్ 203 జిల్లా గవర్నర్ (ఎలెక్ట్)2025 నలుబోలు బలరామయ్యనాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ 203 జిల్లా గవర్నర్ పలగాటి శ్రీనివాసులురెడ్డి, బిరుదవోలు రామ్మోహన్‌రెడ్డి, షేక్ నజీర్ అహ్మద్, శానంపూడి సుబ్బరాయుడు తదితరులు పర్యవేక్షించారు.

# 'అద్వైత భారత్'కు వక్తల ప్రశంస



ప్రముఖ రచయిత, నెల్లూరు వాస్తవ్యుడు..ప్రస్తుతం చెన్నైలో నివాసం ఉంటున్న చతుర్వేదుల చెంచుసుబ్బయ్య రచించిన 'అద్వైత భారత్' నవల సందేశాత్మకంగా ఉందంటూ పలువురు వక్తలు ప్రశంసించారు. ఈనెల 22న స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని జిల్లా గ్రంథాలయసంస్థలో పెన్నా రచయితల సంఘం(పెరసం) ఆధ్వర్యంలో ఆ నవల ఆవిష్కరణ ఘనంగా జరిగింది. 'భిన్నత్వంలో ఏకత్వం' అన్న అంశం మీద ఈ నవల రాశారని వక్తలు పేర్కొన్నారు. తొలుత పెరసం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి ఈ నవలను ఆవిష్కరించగా, ప్రథమప్రతిని మోపూరు పెంచలనరసింహం స్వీకరించారు. అవ్వారు శ్రీధరబాబు పుస్తక సమీక్ష చేశారు. ప్రముఖ కవులు చిన్ని నారాయణరావు, పొట్లూరు సుబ్రహ్మణ్యం, డా. గంగిశెట్టి శివకుమార్ పాల్గొని మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు రచయితను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవయిత్రి తోట సులోచన ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. వ్యాఖ్యాతగా ప్రముఖ సాహితీవేత్త డా.చీమకుర్తి వేంకటేశ్వర్లు వ్యవహరించారు.

# కలెక్టర్‌కు సీపీఐ నాయకుల వినతి



జిల్లాలోని రాళ్లపాడు ప్రాజెక్టు కుడికాలువ గేటును పైకి లేపి, ఆయకట్టు రైతులకు సాగునీటిని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి దామా అంకయ్య ఈనెల 23న నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ షానవాజ్, ప్రధాన కార్యదర్శి గంగపట్నం రమణయ్య తదితర రైతు నాయకులు పాల్గొన్నారు.

# 'చక్రాల వారి ట్రస్ట్' సేవాభావం

**• 29 మంది విద్యార్థులకు 3.10 లక్షల సాయం**



నెల్లూరులోని చక్రాల వారి ట్రస్ట్ వారు ఇటీవల ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన 29మంది పేద విద్యార్థులకు ఉన్నత విద్య, వైద్య సదుపాయాల కోసం ఆర్థికసాయం అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు. దాతల సాయంతో ఒక్కొక్కరికి రూ. 10వేల వంతున మొత్తం 3లక్షలా 10వేల రూపాయలు పంపిణీచేశారు. స్థానిక ఆదిశంకర ధ్యానమందిరంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్ పాల్గొని, ఎంబీబీఎస్, బీడీఎస్, ఎంబీఏ, ఎంసీఏ, బీసీఏ, ఎమ్మెస్సీ. బీఫార్మసీ, మరియు డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఆ సాయం అందించారు. ట్రస్ట్ మేనేజర్ సివిఎల్ నరసింహం, కార్యదర్శి ములుముడి ఉదయకుమార్‌శర్మ, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, ఆడిటర్ సూర్యనారాయణ, జయప్రకాష్, డాక్టర్ వై.సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ పిఎస్ కార్తీక్, డాక్టర్ చక్రధరరావు, గోవిందరాజు సుభద్రాదేవి, మైపాడు రాజాశర్మ, మల్లవరపు లక్ష్మీనరసింహారావు, చక్రాల లక్ష్మీరమణమూర్తి, తొండపి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కొండారెడ్డి దంతవైద్యశాలలో రాయితీతో చికిత్సలు



నెల్లూరులోని డాక్టర్ కొండారెడ్డి దంత వైద్యశాల 54వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పలు రకాల దంత చికిత్సలకు సంబంధించి రాయితీలు ఇస్తున్నట్లు వైద్యశాల నిర్వాహకురాలు డాక్టర్ దివ్యరెడ్డి తెలియజేశారు. ఇటీవల ఆమె ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరులోని బృందావనం, చిల్డ్రన్స్ పార్కు రోడ్డుల్లో ఉన్న తమ వైద్యశాలల్లో డిసెంబర్ 31వ తేదీ వరకు ఉచిత కన్సల్టేషన్‌తో పాటు డెంటల్ ఎక్స్‌రేపై 50శాతం, అన్ని రకాల దంత చికిత్సలపై 20 శాతం రాయితీలు ఉంటాయని, దంత సమస్యలు ఉన్నవారు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

## అపోలో హాస్పిటల్స్ సహకారంతో అంతర్జాతీయ న్యూరాలజీ సదస్సు



నెల్లూరులోని అపోలో హాస్పిటల్స్ సహకారంతో ఇటీవల రెండు రోజులపాటు 'అంతర్జాతీయ న్యూరాలజీ' సదస్సు జరిగింది. స్థానిక అపోలో హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్, న్యూరాలజీ విభాగ అధిపతి డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్, అపోలో ఆసుపత్రి, చిత్తూరు అపోలో మెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో "పెరల్స్ ఇన్ క్లినికల్ న్యూరాలజీ" అనే అంశంపై జరిగిన ఈ 10వ వార్షిక అంతర్జాతీయ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ వైద్యసంస్థల నుండి 24 మంది న్యూరో స్పెషలిస్టులు, సుమారు 270 మంది వివిధ వైద్యనిపుణులు పాల్గొని వైద్యపరమైన అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వైద్య విజ్ఞాన భాగస్వామ్యం, నెట్ వర్కింగ్, నైపుణ్యాభివృద్ధి అంశాలపై చర్చించి, రోగుల ఆరోగ్యం, సంరక్షణ మెరుగుపరిచేందుకు అందరూ కలిసి విజ్ఞానాన్ని పంచుకోవాలని నిర్ణయించారు. ప్రతిఏట ఇలా సదస్సులు నిర్వహించి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం తమకు ఎంతో సంతోషంగా ఉందని డాక్టర్ బిందుమీనన్ ఈ సందర్భంగా చెప్పారు. క్లిష్టతరమైన స్ట్రోక్ మేనేజ్‌మెంట్, ఎపిలెప్సీ, న్యూరోడెజెనరేటివ్ డిజార్డర్స్ అంశాలపై చర్చలు నిర్వహించి న్యూరాలజీ వైద్యంలో పలు నూతన విషయాలను తెలుసుకున్నారు. న్యూరాలజీ వైద్యంలో ఎదురయ్యే పలు సవాళ్లను ప్రత్యక్షంగా వివరిస్తూ, వాటిని ఏ విధంగా విజయవంతంగా ఎదుర్కోవాలో నిపుణుల బృందం వర్క్‌షాపులను కూడా నిర్వహించింది. ఎంతో క్లిష్టమైన పలు న్యూరాలజీ కేసులను కూడా చర్చించారు. న్యూరాలజీ వైద్య రంగంలో నిపుణులు నూతన వైద్య విధానాలను తెలుసుకుంటూ ముందుకెళితే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే అవకాశం ఉందని డాక్టర్ బిందుమీనన్ అన్నారు. అపోలో హాస్పిటల్స్ సిఈఓ నవీన్‌రెడ్డి, నెల్లూరు అపోలో హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్, అపోలో హాస్పిటల్స్ మెడికల్ సర్వీసెస్ చీఫ్ డాక్టర్ రోహిణి, ఏపీ మెడికల్ కౌన్సిల్ నుండి డాక్టర్ జి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీస్తు జన్మదినం.. లోకానికి పర్వదినం!

**• అంబరాన్నంటే సంబరంగా.. క్రిస్మస్ వేడుకలు**



*క్రిస్మస్ పండుగ సందర్భంగా డిసెంబరు 25న జిల్లావ్యాప్తంగా అన్ని చర్చిల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఏసుక్రీస్తు జన్మదినాన్ని పర్వదినంగా జరుపుకుంటూ అన్ని చర్చిల్లో వేడుకలు మిన్నుముట్టాయి. విద్యుద్దీపాల కాంతులతో చర్చిలను శోభాయమానం చేసి, లోకరక్షకుడైన ఏసుక్రీస్తు ఆరాధనలో భక్తులు తరించారు. ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, దయ, కరుణ, శాంతి, క్షమాగుణం వంటి దైవగుణాలతో అందరూ జీవించాలని పాస్టర్లు, బిషప్‌లు దైవ వాక్యాలను వివరించారు.*

జిల్లా అంతటా..వాడవాడలా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువ నుంచే చర్చిలకు వచ్చి క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తితో బైబిల్‌ను పఠించారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకుని ఆనందించారు. ఏసు క్రీస్తు చూపిన శాంతిమార్గంలో నడుస్తూ, ఆ ప్రభువు దీవెనలతో అందరూ సుఖ సంతోషాలతో జీవించాలంటూ పాస్టర్లు దైవ సందేశమిచ్చారు. అనేక ప్రాంతాల్లో సేవాకార్యక్రమాలు జరిగాయి. పేదలకు అన్నదానాలు, వస్త్ర దానాలు చేశారు. స్వీట్లు పంచిపెట్టారు.

నెల్లూరు నగరంలోని చర్చిలన్నీ ప్రత్యేక అలంకరణలతో దేదీప్యమానమయ్యాయి. కపాడిపాళెంలోని సెయింట్ జోసఫ్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని, చిన్నారులతో కలసి కేకు కట్‌చేసి, దైవ ప్రార్థనల్లో పాల్గొన్నారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బాల ఏసు జన్మ దినాన్ని పురస్కరించుకుని కన్నులపండువగా జరిగిన నగరోత్సవంలో మంత్రి నారాయణ పాల్గొని రథాన్ని లాగారు.

### భక్తిశ్రద్ధలతో వేడుకలు

నగరంలోని అన్ని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఏబీఎం కాంపౌండ్‌లోని లోన్‌స్టార్ బాప్టిస్టు చర్చిలో కంచర్ల ప్రభుదాస్, విజయ కుమార్‌ల ఆధ్వర్యంలో దైవారాధనలు జరిగాయి. అదేవిధంగా సంతపేటలోని జేమ్స్ ఆఫ్ క్రైస్ట్ చర్చిలో రెవరెండ్ జోరోమ్ పాస్టర్, రోమన్ కాథలిక్ కెథడ్రిల్ చర్చిలో బిషప్ ఎం.డి ప్రకాశం, రైల్వేఫీడర్స్ రోడ్డులోని లోన్‌స్టార్ బాప్టిస్టు చర్చిలో బెన్హర్ బాబు, వీఆర్‌సీ కూడలిలో ఉన్న బాప్టిస్టు చర్చి డౌనీహాల్‌లో రెవరెండ్ శ్యాంసన్ కుమార్, బట్వాడిపాళెంలోని ది సెంటినరీ బాప్టిస్టు చర్చిలో రెవరెండ్ హరిపాల్, నీలగిరిసంఘంలోని హెబ్రోన్ బిలీవర్స్ అసెంబ్లీస్ చర్చిలో రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, వేదాయపాళెంలోని ది గుడ్‌న్యూస్ బాప్టిస్టు చర్చిలో రెవరెండ్ రాజశేఖర్.. ఇలా నగరంలోని అన్ని చర్చిల్లో భక్తిశ్రద్ధలతో దైవప్రార్థనలు జరిగాయి. క్రైస్తవ సోదరులంతా కుటుంబాలతో సహా వచ్చి ఏసుక్రీస్తు జన్మించిన రోజైన క్రిస్మస్‌ను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.




లాయర్
డిసెంబర్ 27, 2024

# కొత్త సంవత్సరం!.. కలలను సాకారం చేసుకుందాం!

మరో నాలుగు రోజుల్లోనే కొత్త సంవత్సరం.. 2025 వస్తోంది. అయినా, అటు తిరిగి ఇటు చూసేసరికి పాత ఏడాది ఇంతలోనే అయిపోవచ్చింది. 2024కు వీడ్కోలు పలకాల్సి వస్తోంది. అంతే, కాలం ఎవరికోసం ఆగదు. మనపాటికి మనం ఎక్కడున్నా, ఏం చేస్తున్నా దానిపాటికది జరిగిపోతూనే ఉంటుంది. నిద్రలేచి చూసేసరికి ఒకరోజు కరిగిపోతూనే ఉంటుంది. కాలచక్రగమనం తీరే అంత!.. అందుకే కాబోలు.. జీవితం క్షణభంగురమేనంటారు పెద్దలు. 'కన్ను తెరిస్తే జననం - కన్నుమూస్తే మరణం - రెప్పపాటు జీవితం' అంటారో కవి. ఎంత వాస్తవమో కదా! అంతమాత్రాన జీవితం క్షణికమే కదా అని నిరాశకు గురికాకుండా, జీవించినంత కాలం మంచిగా జీవించాలి. మనిషిగా పుట్టినప్పుడు మనిషిగానే బతకాలి. మానవత్వంతోనే మనుగడ సాగించాలి. అందులోనూ కాలం కంటే వేగంగా.. శరవేగంగా పరుగులు తీస్తున్న నేటి సాంకేతిక యుగంలో, మానవ జీవితాలు యాంత్రికంగా తయారైన ప్రస్తుత పరిస్థితుల్లో మనిషి తన ఉనికిని ఎప్పటికప్పుడు కాపాడుకుంటూ ఉండాలి. పుట్టినందుకు, మానవ జన్మ ఎత్తినందుకు జీవితాన్ని సార్ధకం చేసుకోవాలి. స్వార్ధం, ధనాశ, అధర్మం, అన్యాయం, అవినీతి అక్రమాలు పెరిగిపోయి సగటు మానవుడు బతకలేని దుస్థితిలో ఉన్న ఇప్పటి మాయాజాలపు కాలంలో ఎవరైనా సరే..తన చిరునామాను మాత్రం మరచిపోకూడదు. జన్మించినందుకు జీవితాన్ని ధన్యం చేసుకుంటూ, కాలం మీద మనదంటూ ఓ చెదిరిపోని సంతకం చేయాలి. వర్తమానంలోనే కాక భవిష్యత్తులోనూ మన పేరు చిరస్థాయిగా ఉండాలి. అలా..'కలలు కనడమే కాదు..ఆ కలలను సాకారం చేసుకోవాలి' అని చెప్పిన మహనీయుడు అబ్దుల్‌కలాం జీవితాన్ని ఓసారి జ్ఞాపకం చేసుకోవాలి. రేపటి భవిష్యత్తును ఆవాహన చేసుకుంటూ ముందుకు సాగాలి. సమాజానికి స్ఫూర్తిదాయకమైన ఎందరో మహనీయులను, వారి సేవలను, మన జీవితాలను వెలుగుల మయం చేసేందుకు వారు పడిన కష్టాలను, చేసిన త్యాగాలను అప్పుడప్పుడూ మననం చేసుకోవాలి. ముఖ్యంగా విద్యార్థులు, దేశాన్ని ముందుకు నడిపించాల్సిన యువత.. ఎట్టి పరిస్థితుల్లోనూ పక్కదార్లు పట్టకుండా విజ్ఞతతో రాణించాలి. అత్యంత ప్రతిభాపాటవాలు సాధించాలి. అత్యున్నత శిఖరాలను అధిరోహించాలి. కష్టాలు, కన్నీళ్లు ఎన్నున్నా అన్నిటినీ ఆత్మస్థైర్యంతో దాటుకుపోవాలి. మార్కుల కోసం కాదు.. రిమార్కు లేకుండా బతకాలి. అనుకున్న 'లక్ష్యం' చేరుకునేందుకు అహరహం కష్టపడాలి. ఎంతచెట్టుకు అంత గాలి. సమస్యలన్నవి అందరి జీవితాల్లోనూ ఉంటాయి. 'కాళ్లు తడవకుండా సముద్రాలు దాటవచ్చేమో కానీ, కన్నీళ్ళు తగలకుండా జీవితాన్ని దాటలేం'.. అంటారో కవి. అంతేమరి!..జీవితమన్నాక ముళ్ళూ-రాళ్లూ ఉంటాయి. ఏరుకుంటూ పోవాల్సిందే. అయితే, కష్టాల కడలిలో ఒంటరిప్రయాణంలో ఏ దిక్కూ లేనప్పుడు.. చుక్కానిలా దిక్కుదిశా చూపేవారు కూడా ఉంటారు. అంతా చీకటనే అనుకోకు.. దారిదీపాలెన్నో ఉంటాయి. పుట్టగానే ఊరకే పెద్దవాళ్లమైపోతున్నామా?.. తల్లితండ్రులే కాళ్లూ చేతులుగా నిలిచి, వాళ్ల ప్రాణాలను మనకు ఊపిరిగా మలచి, మనలను పడిపోకుండా చేయిపట్టుకు నడిపించడం లేదూ!..అందుకే చీకటిని చూసి భయపడకుండా..చిరుదీపం వెలిగించుకోవాలి. అయినా..ఇప్పటి ప్రపంచం మునుపటిలా లేదు. అంతా మాయాప్రపంచమే. అరచేతిలో ప్రపంచం..అనితరసాధ్యమైన పనులను కూడా సాధ్యం చేసి చూపుతోంది. తెలివిగా ఉపయోగించుకోవాలే కానీ, తెలియనిదేమీ ఉండదు. అందుకే, సాంకేతికత అన్నదే ఇప్పుడు ప్రధానం. అఆఇఈలు, వానాకాలపు మొక్కుబడి చదువులు చదువుకున్నంత మాత్రాన ప్రయోజనం లేదు. పలకలు, బలపాల కాలం ఎప్పుడో పోయింది. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌ల కాలమిది. ఓ 50ఏళ్ల కాలంలోనే ఎన్నిమార్పులే చెప్పలేనన్ని.. లెక్కలేనన్ని. సాంకేతిక పరిజ్ఞానం పుష్కలంగా ఉంటేనే ఇప్పుడు బతుకు బండి సాగేది. అలక్ష్యంగా ఉంటే.. బతుకంతా గతుకుల గండమే. అజ్ఞానమనే బురదగుంటలోంచి ఇకనైనా బయటపడి, ఆధునిక జ్ఞానం వైపు, సాంకేతిక విజ్ఞానం వైపు చూపు సారించాలి. మొత్తంగా ప్రపంచానికే మనం దశ-దిశ చూపించే దిక్సూచీలం కావాలి. దేశమే గర్వపడే విధంగా జీవితాలను సాగించినప్పుడే.. మన కలలు సాకారమైనట్లు లెక్క!... కొత్త సంవత్సర మేదో వచ్చి.. ఆ కలలన్నిటినీ నెరవేరుస్తుందిలే అనే నిర్లక్ష్యాన్ని వదిలిపెట్టి, కాలంతో పాటు పరుగు తీస్తూ.. మన కలలను మనమే కష్టపడి నెరవేర్చుకోవాలన్నదే సారాంశం!.. అందుకు..రానున్న నూతన సంవత్సరం ఒక మహోన్నతమైన మానవీయ సంగీతంగా..సరికొత్త మార్పుకు సంకేతంగా మారాలి!..లేకుంటే..మనమే మార్చుకోవాలి!...

# సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 70

## చదువులకు దూరంగా.. చాకిరీకి చేరువగా..చిన్నారులు!

"విద్య లేకుంటే బ్రతుకు మిధ్యే" ఇది జగమెరిగిన సత్యం. "విద్యలేనివాడు వింత పశువు" అన్న సామెత కూడా పలు సందర్భాలలో మనం వింటూనే ఉంటాం. చదువే లేకుంటే అసలు జీవితానికి వెలుగే ఉండదన్న సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందుకోసమే ప్రపంచంలో ఎక్కడైనా సరే ప్రభుత్వాలు చదువులకే తొలి ప్రాధాన్యత ఇస్తాయి. అందరూ తప్పనిసరిగా చదువుకోవాలన్న లక్ష్యంతో విద్యారంగాన్ని ప్రోత్సహిస్తాయి. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు. పాత రోజుల్లో చదువులు పురుషులకి, ధనవంతులకి మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడా రోజులు పోయాయి. ఎవరైనా చదువుకోవచ్చు. ఎంత బాగా చదువుకుంటే అంతగా సహకరించేందుకు ప్రభుత్వాలు, దాతలు, స్వచ్ఛంధ సంస్థలు కోకొల్లలుగా ఉన్నాయి.

అయితే, అది శాపమో మరి పాపమో తెలియదు కానీ..ఏళ్ల తరబడిగా మనదేశంలో అనేకమంది బాల బాలికలు చదువులకి దూరంగానే ఉంటున్నారు. ప్రభుత్వాలు విద్యా రంగం కోసం ఏటా కోట్లాదిరూపాయలు ఖర్చు చేస్తున్నాయి. విద్య కోసం ప్రత్యేక శాఖలే నడుపుతున్నాయి. మరోవైపు ప్రైవేటు రంగంలోనూ విద్యకు బోలెడన్ని అవకాశాలుంటున్నాయి. అయినా, లక్షలాదిమంది పిల్లలు నిరక్షరాస్యులుగానే మిగిలిపోతున్నారు.

అమ్మఒడి లాంటి చదువుల బడిలో పలకా బలపం పట్టాల్సిన చిట్టిచేతులు, పొలాల్లో పలుగూ-పార పట్టి చాకిరి చేస్తున్నాయి. భవననిర్మాణ పనులతో మలినమవుతున్నాయి. మెకానిక్ షెడ్లలో మసిబారిపోతున్నాయి. వంటింటి పనులతో కమిలిపోతున్నాయి. ఇలాంటి అనేక దయనీయ పరిస్థితులు చిన్నారుల బాల్యాన్ని చిదిమేస్తున్నాయి. వారిని నిరక్షరాస్యులని చేసి అంధకారంలో బంధిస్తున్నాయి. మన దేశంలో 1.17 మిలియన్ల మంది, అంటే సుమారు 12 లక్షల మంది బాలబాలికలు బడులకు వెళ్ళడం లేదని గణాంకాలు చెప్తున్నాయి. అంతేకాదు, దాదాపు ఒక కోటీపైగా బాలకార్మికులుగానే ఉంటూ చాకిరీలో మగ్గిపోతున్నారని కూడా నిపుణుల అంచనా.

### పేదరికమే... పెనుశాపం

'కూడు, గూడు, గుడ్డ' అనే కనీస వసతులు కూడా లేక.. దేశంలో నేటికీ లక్షలాది కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. తమకంటూ ఒక ఇల్లు, తమదంటూ ఒక ఊరు కూడా లేని గ్రామీణ నిరుపేదలు, ఏ ఊళ్ళో పనులు దొరికితే అక్కడికి కడుపు చేతపట్టుకుని వలస పోతున్నాయి. కార్మికులు, వ్యవసాయ కూలీలతో పాటు, కుల వృత్తులు చేసుకునే అనేక నిరుపేద కుటుంబాలు పెద్దసంఖ్యలో వలసజీవులుగానే జీవితయాత్రలు సాగిస్తున్నాయి. దీనికంతటికీ పేదరికమే మూల కారణం. అదే ఆ కుటుంబాలకు పెద్ద శాపం. నిజమైన ఈ నిరుపేదలకు ఎవరి దగ్గరనుండి ఎలాంటి చేయూత ఉండదు. ఎటువంటి ప్రభుత్వ పథకాల కూడా వారి దరిదాపులకు రావు. ఒక స్థిరనివాసమంటూ ఏదీ లేక ఎక్కడ పనులుంటే అక్కడికల్లా వెళ్తుంటే, పిల్లలు కూడా వారితోపాటే తరలిపోతుంటే ఇక బడేమిటి?.. చదువులేమిటి?.. అసలు, స్థిరనివాసం ఉంటేనేకదా విద్యాభ్యాసం..? కుదురే లేకుంటే కుండెలా నిలబడుతుంది?.. కారణం ఏదైనా ఇటు బాల్యాన్నీ అటు బంగారు భవిష్యత్తుని కోల్పోతోంది మాత్రం అభం శుభం తెలియని పసిహృదయాలే.

### మూల కారణం అన్వేషించాలి

'అందరికీ చదువు' ప్రభుత్వ బాధ్యత అంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీరాలు పలుకుతున్నాయి. కేవలం ప్రచారం కోసం కోట్లు తగలబెడుతున్నాయి. రకరకాల పథకాలకు నిధులు కుమ్మరిస్తూనే వున్నాయి. వసతి వాసం ఉన్న కుటుంబాలు బిడ్డలను ప్రభుత్వ బడుల్లో, వసతిగృహాల్లో చేర్పించి చదివించుకుంటున్నారు. వారి అభివృద్ధికి బంగారు బాటలు వేసుకుంటున్నారు. ప్రభుత్వాలు బడికి వచ్చే పిల్లలకి అన్నం పెడుతున్నాయి, పుస్తకాలిస్తున్నాయి. నాణ్యమైన చదువులు అందిస్తున్నాయి. అన్నీ చేస్తున్నా, కొంతమంది బడులకు వెళ్ళలేకపోతున్నారు. ఇక్కడ సమస్య బడులకు వెళ్ళే బాలలది కాదు.. స్కూళ్ళకి వెళ్ళని.. వెళ్ళలేని బాలలది. ఆ బాలబాలికలు విద్యాలయాలకి ఎందుకు వెళ్లలేకపోతున్నారనే అంశం పై ప్రభుత్వాలు ప్రధానంగా దృష్టి పెట్టాలి. ఆ సమస్యపైన దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. అలాంటి వారి ప్రధాన సమస్య ఏమిటో కనుగొని దానిని పరిష్కరించగలిగితే ఈ దుర్గతి పోతుంది.

ముఖ్యంగా కొండకోనల్లో ఉండే గిరిజన కుటుంబాలు, మారుమూల గ్రామాల్లో ఉండే దళితులు, బడుగు బలహీనవర్గాల ప్రజలు ఏళ్ళతరబడిగా పేదరికంలోనే మగ్గిపోతున్నారు. రెక్కాడితే తప్ప డొక్కాడని స్థితిలో, అర్ధాకలితో అలమటిస్తూనే ఉన్నారు. ప్రధానంగా ఆ కుటుంబాల్లోని పెద్దవాళ్ళకే చదువు లేకపోవడంతో ఇక చిన్నపిల్లల చదువుల గురించి ఆలోచించే అవకాశమే వారికీ లేదు కదా! పేదరికంతో పాటు అమాయకత్వం, అజ్ఞానం, మూఢనమ్మకాలు వారి జీవితాలను శాసిస్తున్నాయి. బిడ్డలుంటే కుటుంబానికి చేదోడుగా ఉంటారని, వారిని తమతోపాటు తీసుకు వెళ్తున్నారు. ఇలాంటి కారణాలే ఆ నిరుపేద బాలల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్నాయి. అందుకే, పెద్దలు బతుకుతెరువుకోసం ఎక్కడికి వెళ్ళినా, ప్రభుత్వాలు ఆ పిల్లల బాధ్యత తీసుకునేందుకు ప్రత్యేక వసతి గృహాలు అందుబాటులోకి తేవాలి. ఆ పిల్లల భవితకు భరోసా ఇస్తూ, తల్లిదండ్రులకు ఆమేరకు అవగాహన కలిగించాలి. చదువుకుంటే కలిగే ప్రయోజనంపై గ్రామగ్రామానా అవగాహనా సదస్సులు పెట్టాలి. వలస కుటుంబాలవారు ఊళ్ళు వదలిపెట్టి పోకుండా, వాళ్ళు ఉన్న ప్రాంతాల్లోనే వారికి పనులు కల్పించాలి. ముఖ్యంగా వారికీ ఒక గూడంటూ ఉండేలా ప్రభుత్వాలు పథకాలు రూపొందించాలి. ప్రభుత్వాలు, మేధావులూ, సామాజిక సేవా సంస్థలూ ఆలోచించాలి...!

- రాజశ్రీ

# దోమలకాలం వచ్చేసింది!

ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా, ఎంతమంది నాయకులు మారినా నెల్లూరు ముదురు దోమల నుండి మాత్రం ప్రజలకి విముక్తి కలిగించలేకపోతున్నారు. ఎండాకాలం, వానాకాలం, చలికాలం వచ్చినట్లుగా ఇప్పుడు నెల్లూరుకి దోమలకాలం కూడా వచ్చేసింది. ముఖ్యంగా నెల్లూరు నగరవాసులు దోమల దెబ్బకి హడలిపోతున్నారు. బాగా అభివృద్ధి చెంది ప్రజాప్రతినిధులకి కూడా నివాస కేంద్రాలుగా మారిన మాగుంట లే అవుట్, గోమతినగర్, ఇస్కాన్ సిటీ, కొండాయపాలెం, హరనాథపురం వంటి ప్రాంతాలలో ఉన్న ఖాళీ స్థలాలు ఈ దోమలకి ఉత్పత్తి కేంద్రాలుగా మారిపోయాయి. ఖాళీ స్థలాల్లో నిల్వ ఉంటున్న నీళ్ళ కారణంగా ఆ స్థలాలు మురుగు గుంతలుగా మారిపోయాయి. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల స్థలాలన్నీ నీళ్లతో నిండిపోయాయి. దుర్గంధభూయిష్టంగా మారి పందులు పొర్లాడుతున్నాయి. వీటి కారణంగా దోమల ఉత్పత్తి రెట్టింపు అవుతోంది. నగర కార్పొరేషన్లో పాలకులు ఉన్నా, వాళ్లకి రాజకీయాలతోనే సమయం సరిపోతోంది. కార్పొరేషన్ వైద్య ఆరోగ్య విభాగం అధికారులైనా పట్టించుకొని దోమలనుండి నగర వాసులని కాపాడవలసిందిగా మనవి.

– ఆర్.పీ.రామయ్య - కొండాయపాలెం.

# మస్తానయ్యకి పిల్చి పట్టం కట్టడం అభినందనీయం!

తెలుగుదేశం పార్టీతోనే తన రాజకీయ ప్రయాణం మొదలుపెట్టిన బీద మస్తాన్‌రావుకి ఆ పార్టీ సముచిత గౌరవం కల్పించింది. కుట్రలు, కుతంత్రాలు తెలియని అజాతశత్రువు మస్తానయ్య. తప్పనిసరి పరిస్థితులలో ఆయన పార్టీ మారవలసివచ్చినా మళ్ళీ తన పుట్టింటికే రావడం మంచి నిర్ణయం. తెలుగుదేశం పార్టీ కూడా ఆయనకి మళ్ళీ రాజ్యసభ స్థానం కట్టబెట్టి అటు పార్టీలో, ఇటు ప్రజలలో మంచి గుర్తింపును కల్పించింది. చెప్పిన మాటకి కట్టుబడి మస్తాన్‌రావుకి చంద్రబాబు మళ్ళీ రాజ్యసభ సభ్యత్వ అవకాశం కల్పించడం అభినందనీయం. రాజకీయాలలో విశ్వసనీయతకి టీడీపీ ప్రాధాన్యత కల్పిస్తోందనడానికి ఇది మంచి ఉదాహరణ. మస్తానయ్యకి అభినందనలు!

జి.సురేంద్రరెడ్డి, కావలి.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## వ్యూహం బాగుంది...
# ఆచరణ సాధ్యమైతే మంచిదే!

విజన్-2047 గురించి మన 'లాయర్'లో మంచి హెచ్చరిక చేశారు. నేతల ఆలోచన, ఆశయం మంచివే. కార్యాచరణలో, కర్తవ్యదీక్షలో లోపాలు రాకుండా చూసుకోవాలి. వ్యూహం యొక్క ముఖ్య ప్రణాళిక నీరుగారకుండా జాగ్రత్త పడాలి. ప్రభుత్వాలని పాలించే నేతలతో పాటు అధికార యంత్రాంగంలో కూడా అంకితభావం, కార్యదక్షత పెరగాలి. సమాజం పట్ల బాధ్యతతో రాజకీయ నాయకులతో సమన్వయం చేసుకుని అధికార వ్యవస్థ పనిచేయాలి. అటు అధికారులు ఇటు రాజకీయ శ్రేణులు పట్టుదలతో పనిచేస్తే ఏదీ ఆచరణ అసాధ్యం కాదన్న విషయం గుర్తుపెట్టుకోవాలి.

సీ.ఆర్.విశ్వేశ్వరరావు,
మాజీ ఉపకులపతి - హైదరాబాదు.

# టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న దినేష్‌రెడ్డి



తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, కోవూరు టీడీపీ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, ఆయన తండ్రి.. కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇటీవల రెండు లక్షల రూపాయలు చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీ మాత్రమే రాష్ట్ర అభివృద్ధి చేయగలుగుతుందని వారు పేర్కొన్నారు. సామాజిక న్యాయం పాటిస్తూ కార్యకర్తల సంక్షేమం కోసం పాటుపడే బాధ్యత నారా లోకేష్ తీసుకోవడం హర్షదాయకమన్నారు.

# డల్లాస్‌లో పాత్రికేయురాలికి సన్మానం



ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం, టాంటెక్స్ 'నెలనెలా తెలుగువెన్నెల', తెలుగు సాహిత్య వేదిక 209వ సాహిత్య సదస్సులో "జగము నేలిన తెలుగు" అంశంపై ప్రసంగించిన సీనియర్ పాత్రికేయురాలు డి.పి.అనురాధని, డల్లాస్‌లో ఇటీవల ఘనంగా సన్మానించారు. తెలుగు సాహిత్య వేదిక మరియు ఎన్ఎన్ టీవీ బృందం సభ్యుడు, మన నెల్లూరీయుడు నిడిగంటి గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

# వేమిరెడ్డి దంపతుల భక్తిభావం

## అయ్యప్పస్వామి ఆలయానికి.. 3 లక్షల విరాళం



నెల్లూరు వేదాయపాలెంలో ఉన్న ప్రసిద్ధమైన శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో ఈనెల 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించిన సహస్ర కలశాభిషేకం, సుదర్శన హోమం, మహా మృత్యుంజయ హోమాల నిర్వహణకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు, కోవూరు శాసనసభ్యురాలు.. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు 3 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చి తమ భక్తిభావం చాటుకున్నారు. ఈనెల 22న నెల్లూరులోని తమ నివాసంలో ఆలయ ఛైర్మన్ శేషగిరిరావు, కమిటీ సభ్యులు ప్రసాద్‌లకు వారు ఆ విరాళం అందజేశారు. వేమిరెడ్డి దంపతుల పక్షాన వారి ప్రతినిధి విజయ్‌రెడ్డి ఈ మొత్తాన్ని అందజేశారు. శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో ఈ నెల 25వ తేదీ వరకు ఆ హోమాలు జరిగాయి. ఆ పూజా కార్యక్రమాలకు ప్రధాన దాతలు వేమిరెడ్డి దంపతులే!



# కేంద్ర విమానయాన మంత్రితో.. బీఎంఆర్ భేటీ

రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు(బీఎంఆర్) ఈనెల20న ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లాలోని దగదర్తి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు. విమానాశ్రయానికి ఇచ్చిన భూములకు రైతులకు చెల్లించవలసిన పరిహారం ఇచ్చేందుకు, త్వరితగతిన విమానాశ్రయం పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతూ కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు.

# మైనారిటీల విద్యకి ప్రాధాన్యత



రాష్ట్రంలో మైనారిటీల అభివృద్ధికి, సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎం.ఏ.షరీఫ్ చెప్పారు. నెల్లూరు టీడీపీ కార్యాలయంలో ఈ నెల 24న జరిగిన సమావేశంలో ఏపి వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మైనారిటీల అభ్యున్నతికి కృషి చేసే నేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని అన్నారు. తొలుత నెల్లూరురూరల్‌లోని అక్కచెరువుపాడులో ఉన్న మైనారిటీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. అక్కడ అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను, విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# స్మృత్యంజలి

ఆత్మీయానుబంధాలను మాకు పంచి
చెదరని మీ చిరునవ్వును మాకు మిగిల్చి
మీరు మాకు దూరమై 19 ఏళ్ళు గడుస్తాయి.

**మరపురాని మీ మధుర జ్ఞాపకాలతో...**

భార్య
**డాక్టర్ చిట్టమూరు భారతి**

కుమారుడు
**చిట్టమూరు లోహిత్**

కుమార్తె
**ప్రణీత అరవింద్**

చెల్లెలు
**నిర్మల**

బావ
**డా॥ సి.యం.కె.రెడ్డి**

మరియు **కుటుంబసభ్యులు**

## డా॥ సి.మధుసూదనరెడ్డి

జననం: 04.11.1950 మరణం: 31.12.2005

# హెల్మెట్ లేకుంటే ప్రమాదం

**• వాహనదారులకు పోలీసుశాఖ అవగాహన**




హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే ప్రమాదమని హెచ్చరిస్తూ జిల్లా పోలీసుశాఖ వారు ఈనెల 23న నెల్లూరునగరంతో పాటు జిల్లావ్యాప్తంగా వాహనదారులకు అవగాహన కలిగించారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో, ఏఎస్పీ సిహెచ్ సౌజన్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు జరిగిన ర్యాలీని తొలుత ఏఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. రహదారి భద్రతా నియమాలను ప్రతిఒక్కరూ పాటించాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను తప్పకుండా ధరించి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని ఆమె హెచ్చరించారు. జిల్లాలో జరిగే ప్రమాదాల్లో ఎక్కువగా హెల్మెట్ ధరించకపోవడం, అతివేగం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయన్నారు. కార్లలో వెళ్లేవాళ్లు తప్పకుండా సీట్‌బెల్ట్‌లు పెట్టుకోవాలని ఏఎస్పీ చెప్పారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, ఏఆర్ డీఎస్పీలు, ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

# ముందస్తు క్రిస్మస్ వేడుకలు



నెల్లూరుజిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సభ్యులు టి.బాలసుధాకర్ ఆధ్వర్యంలో ఈనెల 24న ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ప్రగతినగర్‌లోని ఆయన నివాసంలో నెల్లూరు డివిజనల్ కమాండర్ బి రూథర్ సామ్యుయేలు, మండల స్త్రీల విభాగం అధ్యక్షురాలు సాత్విక, కోర్ కమాండర్ వెంకటేశ్వర్‌రావు, జ్యోతి తదితరులు పాల్గొని ఏసుప్రభువును ఆరాధించారు. దైవసేవకులు దేవుని సువార్తను ప్రకటించి, అందరికీ క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సుమారు 5 వందల మందికి క్రిస్మస్ విందు ఏర్పాటుచేశారు. టి.విజయప్రసాద్, టి.మేరీ గ్రేస్, సిహెచ్ చినబాబు, నెల్లూరు మనోహర్, భరత్, మానస, పద్మజ. డా.భారతి, జి.విక్టోరియా, జెస్సీ, షైనీ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు. ప్రతిఏటా జరిగే విధంగానే ఈసారి కూడా బాలసుధాకర్ ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించడం పట్ల ఆయన అందరి అభినందనలు అందుకుంటున్నారు.

# డీసీసీ బ్యాంకు క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరుజిల్లా సహకార బ్యాంకు (డీసీసీ బ్యాంకు) 2025వ సంవత్సర క్యాలెండర్‌ను ఈనెల21న జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఆవిష్కరించారు. జిల్లా సహకారశాఖ అధికారి బి.గురప్ప, డీసీసీ బ్యాంకు సీఇఓ ఎస్.శ్రీనివాసరావు, జనరల్‌మేనేజర్ సరిత, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.






# నెల్లూరు కబుర్లు

## పీఏసీఎస్ ఎన్నికలపై అజయ్ సమీక్ష



రానున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఎన్నికలపై పార్టీ తరఫున కార్యకర్తలను, నాయకులను రంగంలోకి దించేందుకు ప్రభుత్వం కసరత్తు జరుపుతున్న నేపథ్యంలో, నెల్లూరులో ఆమేరకు ఆ ఎన్నికలపై రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని గూడూరు, ఉదయగిరి, వెంకటగిరి, సూళ్ళూరుపేట నియోజకవర్గాలకు సంబంధించిన నాయకులతో ఆయన ఈనెల 24న సమావేశమయ్యారు. ఆ ఎన్నికల్లో నాయకులు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. అన్ని పిఏసీఎస్‌లలోనూ జనసేన పార్టీ ప్రాతినిధ్యం ఉండేలా చూడాలన్నారు. జనసేన నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, సుజయ్‌బాబు, గునుకుల కిషోర్ పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

**నుడా ఛైర్మన్ శీనయ్య**



విద్యార్థుల్లోని సృజనాత్మకశక్తిని వెలికితీసి, వారికి బంగారు భవిష్యత్తు ఉండేలా చూడాలని నెల్లూరు నగరాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చెప్పారు. ఇటీవల బాలాజీనగర్ నలంద పాఠశాలలో ఘనంగా సైన్సు ఎక్స్‌పో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శీనయ్య, ఆ స్కూల్ విద్యార్థులు తయారుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనలను చూసి అభినందించారు. చంద్రయాన్-3, వాటర్ ప్యూరిఫికేషన్, స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుల రూపకల్పనల్లో విద్యార్థుల ప్రతిభాపాటవాలు ఎంతో ఆకట్టుకునేవిధంగా ఉన్నాయంటూ ఆయన మెచ్చుకున్నారు. పాఠశాల డైరెక్టర్ ఫహీమ్, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, పాఠశాల ఛైర్మన్ మజహర్, అంచూరి శ్రీనివాసులునాయుడు, నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేందర్‌రెడ్డి, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మురళీమోహన్‌రాజు, విక్రమ సింహపురి యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, ప్రొఫెసర్ మణికంఠ, సెట్నెల్ సి.ఇ.ఓ బి.శ్రీనివాసరావు, ఎం.డి గయాజ్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ ద్వారా ఇంటివద్దకే సరుకులు



ఆర్టీసీ కార్గో విభాగం ఆధ్వర్యంలో ఇంటివద్దకే సరుకులు తీసుకువచ్చే 'డోర్ డెలివరీ' కార్యక్రమాన్ని ప్రజలు ద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి కోరారు. ఈనెల 23న ఆయన నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో ఆమేరకు 'డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవం' కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 80 ముఖ్యకేంద్రాలు, ప్రధాన నగరాల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉందని ఆయన చెప్పారు. ఆర్టీసీ 2వ డిపో మేనేజర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

## 'విజయదీపిక' పుస్తకావిష్కరణ

జిల్లాలోని 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగపడేలా రూపొందించిన 'విజయదీపిక' పుస్తకాలను జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఈనెల 24న ఆవిష్కరించారు. జడ్పీ నుంచి విజయదీపిక పుస్తకాలను సిద్ధం చేశామని, జిల్లాలో 318 జడ్పీ స్కూళ్లలో ఉన్న 15,597 మంది టెన్త్ విద్యార్థులకు వాటిని అందజేసి, పరీక్షలకు సమాయత్తం చేస్తున్నామని ఈ సందర్భంగా జడ్పీ సీఇఓ విద్యారమ చెప్పారు.

# 'నారాయణ'లో 'నీట్-సక్సెస్ మీట్'



నెల్లూరులోని 'నారాయణ' వైద్యకళాశాల ఆడిటోరియంలో ఇటీవల 'నీట్-సక్సెస్ మీట్-2024' కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఆ విద్యాసంస్థల జనరల్‌మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొని, పోటీ పరీక్షల్లో గత నాలుగు దశాబ్దాలుగా 'నారాయణ'దే అగ్రస్థానమన్నారు. ఈ ఏడాది కూడా సుమారు 350 మందికి పైగా విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించడం తమకెంతో గర్వకారణమన్నారు. అసాధారణ ప్రతిభతో తమ విద్యార్థులు రాణించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నీట్-2024లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి పలు ప్రతిష్ఠాత్మక వైద్యకళాశాలల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులను సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ జయకుమార్‌రాయుడు, డీజీఎంలు మధుసూదన్‌రెడ్డి, మహేష్, డీన్‌లు విష్ణువర్ధన్, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, ఏజీఎంలు పెంచలరెడ్డి, హజరత్ నాయుడు, గురవయ్య, కృష్ణారెడ్డి పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రమిషన్‌లో.. ప్రపంచ ధ్యాన దినోత్సవం




డిసెంబరు 21వ తేదీని ఐక్యరాజ్యసమితి 'ప్రపంచ ధ్యాన దినోత్సవం'గా ప్రకటించిన నేపథ్యంలో, ఆ రోజున నెల్లూరులోని శ్రీ రామచంద్ర మిషన్ ధ్యానమందిరంలో ఉదయం 9గంటలకు, మళ్ళీ సాయంత్రం 5 గంటలకు 'ధ్యానం' నిర్వహించారు. ఆ సంస్థ జోనల్ కోఆర్డినేటర్ డా. ఎం.వెంకటకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ క్యాక్రమంలో, ధ్యాన సాధకులతో పాటు అనేకమంది ప్రజలు కూడా ఈ ధ్యానంలో పాల్గొన్నారు. అదే విధంగా, రామచంద్రమిషన్ ఆధ్వర్యంలో స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, ఇంకా పాలు విద్యాసంస్థల్లో కూడా ధ్యాన దినోత్సవం నిర్వహించి, ధ్యానం ప్రాధాన్యతను వివరించారు. ధ్యానంతో మానసిక ప్రశాంతత, మంచి ఆరోగ్యం కలుగుతాయని చెప్పారు.

# పెద్దాసుపత్రిలో 'వెల్ వాకర్స్' అన్నదానం



నెల్లూరు సాయిసేవా ట్రస్ట్ వారు ప్రతిరోజు నగరంలోని పెద్దాసుపత్రికి వచ్చే రోగుల సహాయకులకు అన్నదానం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆ సేవా కార్యక్రమానికి దాతలు ఎంతగానో సహకరిస్తున్నారు కూడా. ఈ నేపథ్యంలో నెల్లూరులోని 'వెల్‌వాకర్స్ వింగ్' సంస్థ అధ్యక్షులు బొగ్గవరపు శ్రీమన్నారాయణ, తన మనుమడు సాధుమోక్షిత్ కృష్ణ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈనెల 24న పెద్దాసుపత్రిలో అన్నదానం నిర్వహించారు. సీనియర్ వాకర్స్ నలుబోలు బలరామయ్యనాయుడు, లక్ష్మీనారాయణ, రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, డా.గంగిశెట్టి శివకుమార్, మహిళా సభ్యులు కృష్ణవేణి, తేజస్విని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కొండాయపాలెం స్కూల్‌లో.. ప్రీ క్రిస్మస్



క్రిస్మస్ పర్వదినం సందర్భంగా నెల్లూరులోని కొండాయపాలెం నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ఈనెల 23న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. పాస్టర్ హనోక్ క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. తొలుత, కేకు కట్‌చేసి నిరుపేద పిల్లలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా సీజీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉషాకిరణ్, 20వ డివిజన్ కార్పొరేటర్ చేజర్ల మహేష్‌బాబు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబుతో..అబ్దుల్ అజీజ్ భేటీ



రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్‌గా నియమితులైన నెల్లూరు టీడీపీ నాయకుడు అబ్దుల్ అజీజ్ ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణతో కలిసి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సచివాలయంలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో వారు భేటీ అయ్యారు. వక్ఫ్‌బోర్డు నిర్వహణ, తదితర కీలక అంశాలపై అబ్దుల్ అజీజ్ ముఖ్యమంత్రితో చర్చించారు. వక్ఫ్‌బోర్డు నిర్వహణ సక్రమంగా జరగాలని, బోర్డ్ నిర్వహణతో కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని అజీజ్‌కు ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు సూచించారు.

# జిల్లా అభివృద్ధికి.. మనసుపెట్టి పనిచేయండి

## • 'దిశ' సమావేశంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపు

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అధికార యంత్రాంగం మనసుపెట్టి పనిచేయాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరుజిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయం, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అందరికీ అందాలనే అత్యున్నత లక్ష్యంతో భారత ప్రధాని నరేంద్రమోదీ ఈ 'దిశ కమిటీ'ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ప్రతి మూడు నెలలకొకసారి ఈ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తామని, కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం అమలుచేస్తున్న 67 అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జిల్లా ప్రజలకు అందించడం ధ్యేయంగా కృషిచేయాలని ఆయన సూచించారు. ఢిల్లీలో ప్రధానమంత్రి మోదీని కలిసినప్పుడు ఆయన ప్రధానంగా ఈ కమిటీ సమావేశంపైనే తనతో ప్రస్తావించారని, జిల్లాలో ఈ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని తనతో చెప్పారన్నారు.



### కేంద్రప్రభుత్వం ద్వారా ఎన్నో పథకాలు :

కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి నిధులకు ఎటువంటి ఇబ్బంది లేదని, కేంద్ర ప్రభుత్వం నుండి తగిన సహాయ సహకారాలు అందుతాయని ఎంపీ వేమిరెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. పార్లమెంట్ నియోజకవర్గాల సమస్యల పరిష్కారానికి 10 పార్లమెంటు నియోజకవర్గాలను ఒక సీనియర్ కేంద్ర మంత్రికి కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలోని మారుమూల గ్రామానికి కూడా రోడ్డు కనెక్టివిటీ కల్పించేందుకు ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన పథకాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా నిర్మిస్తున్న అన్ని గృహాలను కూడా పేదలకు ఉపయోగపడేలా త్వరగా నిర్మించాలన్నారు. జల్‌జీవన్ మిషన్, ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన, భేటీ బచావో భేటీ పడావో, పిఎం పోషణ (మధ్యాహ్నభోజనం), జనని సురక్షి యోజన, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, సామాజిక పింఛన్లు, ఉపాధిహామీ పథకం, స్వచ్ఛభారత్ మిషన్ మొదలైన పథకాలను సక్రమంగా వినియోగించుకునేందుకు ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంపై అనేక ఆరోపణలు వస్తున్నాయని, ఆ పథకాన్ని మరింత పటిష్టంగా అమలుచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, పలువురు ఎమ్మెల్యేలు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



# హడ్కో సీఎండీతో నారాయణ చర్చలు

రాజధాని అమరావతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అహరహం కృషిచేస్తున్నారు. అమరావతి నిర్మాణానికి హడ్కో సంస్థ కేటాయించిన రూ. 11వేల కోట్ల రుణం విడుదల కోసం ఈనెల 24న మంత్రి నారాయణ ఢిల్లీలోని ఆ సంస్థ సీఎండి సంజయ్ కుల్‌శ్రేష్ణతో సమావేశమై చర్చించారు. హడ్కో నుంచి ఆ రుణం విడుదలకు రాష్ట్రం తరపున చేపట్టాల్సిన చర్యలను ఆయనతో చర్చించారు. అదేవిధంగా రాష్ట్రంలో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు జిందాల్ సా ఛైర్మెన్ పిఆర్ జిందాల్‌తో కూడా మాట్లాడారు. పట్టణాల్లో కుప్పలుతెప్పలుగా వచ్చిపడుతున్న వ్యర్థాలను నివారించేందుకు అలాంటి ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించడంతో, ఆ మేరకు సంబంధిత ప్రముఖులతో సంప్రదింపులు జరిపి, ఆ నిర్ణయాలు అమలులోకి వచ్చేలా ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. సమావేశం అనంతరం జిందాల్ మంత్రి నారాయణను శాలువతో సత్కరించారు.





# ఎన్‌బికెఆర్‌లో..విద్యార్థులకు ఉమ్మడి వార్షిక శిక్షణ




విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజ్‌లో ఇటీవల ఉమ్మడి వార్షిక శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరానికి వివిధ విద్యా సంస్థల నుంచి 450 (300 మంది విద్యార్థులు, 150 మంది విద్యార్థినులు) మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ శిక్షణ వల్ల వారికి శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు సామాజిక అభివృద్ధి, దేశభక్తి, క్రమశిక్షణ, వంటి అనేక అంశాలపై సదవగాహన ఏర్పడుతుందని క్యాంప్ కమాండెంట్ గణేష్ గొడంగవే తెలిపారు. సబ్‌లెఫ్టినెంట్ మల్లికార్జునరెడ్డి, ట్రైనింగ్ ఆఫీసర్ డా. జి.మాధవయ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు పీఐ సిబ్బంది డ్రిల్, నావెల్ ఓరియంటేషన్, సీమాఫోర్, ఫైరింగ్ మరియు సాంస్కృతిక కార్యక్రమాల్లో శిక్షణా మరియు పోటీలను నిర్వహిస్తారని, కళాశాల కో–ఆర్డినేటర్ రాజేష్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతోందని కళాశాల ప్రిన్సిపాల్ ఓ.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామకుమార్‌రెడ్డికి ఆయన ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# వైకాపా 'పోరుబాట' కరపత్రాల ఆవిష్కరణ

వెంకటగిరి పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో ఈనెల 24న వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో, వైకాపా పోరుబాట కరపత్రాలను స్థానిక వైకాపా నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కరెంట్ చార్జీలను తగ్గిస్తామని అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ప్రజల నడ్డి విరిచేలా కరెంటు చార్జీలను పెంచేస్తుందని దుయ్యబట్టారు. వైకాపా అధ్యక్షులు, మాజీ సీఎం వై.యస్.జగన్ పిలుపుమేరకు ఈనెల 27న వెంకటగిరిలోని పాలకేంద్రం సబ్‌స్టేషన్ వద్ద 'పోరుబాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.



# 'టిడ్కో' ఇళ్లకి..మళ్లీ మహర్దశ!

## జూన్ నాటికి..మొదటిదశ ఇళ్ళు - ఛైర్మెన్ అజయ్ వెల్లడి



టిడ్కో ఇళ్లకి మళ్లీ మహర్దశ రానుంది. గతంలో టీడీపీ హయాంలో ప్రారంభమైన ఈ బడుగువర్గాల ప్రజల ఇళ్ళ నిర్మాణాలను, ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం రావడంతో నిర్వీర్యం చేసిన నేపథ్యంలో, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల ఇళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు పూర్తిచేయాలని సంకల్పించింది. వచ్చే జూన్ నాటికి తొలిదశ ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం అన్ని చర్యలు ప్రారంభించింది. దీంతో లబ్ధిదా రుల్లో తిరిగి సంతోషం వ్యక్తమవుతోంది. అంతేకాదు, టిడ్కో లబ్ధిదారులు ఇఎంఐ రూపంలో బ్యాంకులకు కట్టాల్సిన మొత్తం సుమారు 102 కోట్ల రూపాయలను కూడా ప్రభుత్వమే చెల్లించాలని, ఆ భారాన్ని లబ్ధి దారులపై మోపడం సముచితం కాదని నిర్ణయించడంతో లబ్ధిదారులకు పెద్ద ఊరట కలిగించినట్లయింది. రాష్ట్ర టిడ్కో కార్పొరేషన్ ఛైర్మెన్ వేములపాటి అజయ్ కుమార్‌రెడ్డి ఆ విషయాలను ఇటీవల నెల్లూరులోని జనసేన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. టిడ్కో మొదటిదశ ఇళ్లను వచ్చే జూన్ నాటికి నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన చెప్పారు. కనీసం లక్షా 2వేల ఇళ్ళను నిర్మించి లబ్ధిదారులకు అందివ్వాలనే పట్టుదలతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని ఆయన వివరించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురమ్మల తిరునాళ్లకు..రెండో చాటింపు

### ఈనెల 31న.. అల్లూరు గ్రామదేవతల తిరునాళ్ళ



అల్లూరు గ్రామదేవతలు.. అక్కాచెల్లె ళ్ళయిన గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల తిరునాళ్ళకు ఈనెల 24న రెండో చాటింపు వేశారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అల్లూరు ఊరు ప్రజలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. తొలుత శ్రీ పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. డిసెంబరు 31న గ్రామ పెద్దలు, గ్రామస్తులందరి సహకారంతో ఆచారం ప్రకారం సంప్రదాయబద్ధంగా అత్యంత వైభవంగా జరిగే ఈ తిరునాళ్లలో భాగంగా, ఆరోజు ఉదయం 5 గంటలకు అమ్మవారికి అభిషేకం, 8 గంటలకు తూర్పువీధి మహాలక్ష్మమ్మ గుడి వద్ద నుంచి కాటంరెడ్డి శివప్రియమ్మ ఆధ్వర్యంలో 1001 కుండలతో మహిళలు ఊరేగిం పుగా వచ్చి అమ్మవారికి సద్ది నివేదన కార్య క్రమం ఉంటాయి. సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారికి రత్నాలంకారం, బం గారు చీరతో అలంకారం నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలకు గంగమ్మ అమ్మ వారు ముత్యాలచీర అలంకారంలో ప్రత్యేక దర్శనం ఉంటుంది. రాత్రి 9 గంటల నుంచి ముగ్గురమ్మల గ్రామోత్సవం అంగ రంగ వైభవంగా ఉంటుంది కనుక, పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఉత్సవ కమిటీ వారు కోరారు. ఈ సందర్భంగా అందరినీ అలరించేవిధంగా సాంస్కృతిక సంబరా లుంటాయని వారు తెలిపారు. ఈ చాటింపు కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు అనంత రాజు బాలకృష్ణంరాజు, పి.సుధాకర్, బ్రహ్మా నందరావు, కత్తుల కిరణ్ పాల్గొన్నారు.

# గోపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

## జయంతి సభలో డా. విజయకుమార్‌రెడ్డి



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ మాజీ ఛైర్మెన్, జేఎన్‌టీయు మాజీ వైస్‌చాన్సలర్ డా.ఐ గోపాల్‌రెడ్డి ఎన్‌బికెఆర్ కళాశాలకు చేసిన సేవలు చిరస్మర ణీయమని ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా.వి విజయకుమార్‌రెడ్డి కొనియాడారు. డా. ఐ.గోపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా ఇటీవల కళాశాల ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1979లో దివంగత నేత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించినప్పుడు తొలి ప్రిన్సిపల్‌గా డా.ఐ.గోపాల్‌రెడ్డిని నియమించారని, ఈ కళాశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు గోపాల్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిదని ఆయన చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా, డైరెక్టర్‌గా ఆయన సమర్ధవంతంగా విధులు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని అన్ని విభాగాల అధిపతులు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు

# ఎన్‌బికెఆర్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 1995-99 విద్యాసంవత్సరంలో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఇటీవల కళాశాల ప్రాంగణంలో ఆనందోత్సవంగా జరిగింది. తాము విద్యనభ్యసించిన తరగతి గదులను, ల్యాబ్‌లను సందర్శించి నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషించారు. తమకు అప్పట్లో పాఠాలు చెప్పిన అధ్యాపకులను పూర్వ విద్యార్థులు గౌరవంగా ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా తమకు ఆతిథ్యమిచ్చిన కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి వారు తమ కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, మెకానికల్ విభాగాధిపతి డా.విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ఉంటా

## ఎమ్మెల్యే సునీల్‌కుమార్




గూడూరు పట్టణంలోని స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో ఈనెల 24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పి.ఆర్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు షేక్ రియాజ్అహ్మద్ ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు వారు మెమొంటాను బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రిటైర్డ్ ఎంప్లాయిస్‌కు అండగా ఉంటానని, వీరికి సంబంధించిన భూములు ఎవరైనా ఆక్రమించిన, వారికి ఇబ్బందులు కలిగించిన కఠిన చర్యలు తప్పవని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. అనంతరం రిటైర్డ్ ఎంప్లాయిస్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఏపీ ఎస్.జి.ఆర్.ఈ.ఏ స్టేట్ వైస్‌ప్రెసిడెంట్ షేక్ మహబూబ్‌బాషా, ప్రధాన కార్యదర్శి మోహన్, అసిస్టెంట్ ట్రెజరీ శ్రీనివాసులు, ఎస్బిఐ రీజనల్ మేనేజర్ అరుణ్‌కుమార్, చీఫ్ మేనేజర్ సురేష్‌కుమార్, ఎన్‌వి కృష్ణయ్య, భాస్కరరావు, పురుషోత్తం, సుందర రామయ్య, గోను శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని గూడూరు పట్టణం, శాంతినగర్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద వైకాపా నాయకులు కార్యకర్తలు పుట్టినరోజు వేడుకలు నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మేరీగ మురళీధర్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ అందించారు. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా, చెప్పిన పథకాలన్నీ వైఎస్ జగన్ అమలు చేశారని గుర్తు చేశారు. వైకాపా కార్యకర్తలకు ఏ ఇబ్బంది వచ్చిన అండగా ఉంటామని పేర్కొన్నారు. నాయకులు బత్తిని విజయకుమార్, బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, సంపత్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సునీల్, రాధారెడ్డి, సుభాన్ పాల్గొన్నారు.

# శ్రీ గాయత్రిలో ప్రీ క్రిస్మస్



గూడూరులోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఏసుప్రభువు పుట్టుక, క్రిస్మస్ పండుగ విశిష్టతను తెలియజేస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రశాంత్ మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగ విశిష్టతను తెలియజేశారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

గూడూరు రోటరీ క్లబ్, గూడూరు క్రికెట్ క్లబ్, అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఇటీవల ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పివి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కొండిదల మునిగిరీష్, రోటరీ క్లబ్ సెక్రటరీ జిజి నాయుడు అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్ సెక్రటరీ అనిల్‌కుమార్ దశరథరామి రెడ్డి, శ్రీధర్‌నాయుడు, కోచ్ లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వార్షిక తనిఖీలు

గూడూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో వార్షిక తనిఖీల్లో భాగంగా గూడూరు డీఎస్పీ రమణకుమార్ తనిఖీలు చేపట్టారు. పలు రికార్డులను పరిశీలించి, స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాల పురోగతిపై ఆరా తీసారు. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



జానకిరామ.. రామాయణం 45

- ఊటుకూరు జానకి రామారావు



భరతా! ఇక్కడికి మూడున్నర యోజనాల దూరంలో నిర్జన వనముంది. అక్కడ అందమైన సెలయేరులతో కూడిన అడవులు కల చిత్రకూట పర్వతముంది. దానికి ఉత్తరాన మందాకిని నది! నీవు ఆ నదిని దాటిగానీ పర్వతాన్ని చేరుకోలేవు. ఆ పర్వతమే ప్రస్తుతం నీ అన్నగారి నివాసం. దక్షిణంగా కానీ, నైరుతిమార్గంలో కానీ వెడితే నీకు రాముడు కనపడతాడు.

రాముడి ప్రసక్తి రాగానే దశరధుడి భార్యలు ముువ్వురూ భరద్వాజమహర్షి వద్దకు వచ్చారు.

వారిలో కృంగి, కృశించి దీనురాలై వణుకుతూ ఉన్న కౌసల్యాదేవి, సుమిత్రాదేవి మహర్షి పాదాలకు ప్రణమిల్లారు.

తన కోరిక నెరవేరని సర్వలోకనిందిత (అందరూ తిట్టే) అయిన కైక సిగ్గుపడుతూ మహర్షి పాదాలను తాకింది.

అప్పుడు భరద్వాజుడు వీరిని పరిచయం చేయమని కోరగా భరతుడు, ఓ మునిచంద్రా ఇదుగో ఇక్కడ ఉపవాసాలతో కృశించి, దీనంగా ఉండి దేవతాసదృశురాలైన ఈ మాతృమూర్తి కౌసల్యామాత. రాముని కన్నతల్లి.

వనమధ్యంలో పూవులురాలిన పెనువృక్షం వలే ఉండి దుఃఖిస్తున్న మనస్సుతో కౌసల్యామాత ఎడమప్రక్కన నిలబడ్డ ఈ మాతృమూర్తి ఇద్దరు ధీశాలురు, సచ్చరిత్రులు అయిన లక్ష్మణశత్రుఘ్నులను కన్నతల్లి సుమిత్ర.

కోపస్వభావం, వివేకశూన్య, గర్వితురాలు, నేనే అందమైన దానను అను గర్వం కలది, ఐశ్వర్యమందు కోరిక కలది, ఆర్యురాలు లాగ కనపడే అనార్య, క్రూరురాలు, ఆవిడ నిశ్చయాలు పాపానికి దారితీసేవి అయిన ఈమె నా కన్నతల్లి కైకేయి.

ఆమె మూలానే రాముడికి అరణ్యవాసం, దశరధ మహారాజుకు స్వర్గలోకప్రాప్తి సంభవించాయి.

తల్లి గురించి మాట్లాడేటప్పుడు ఆయన కళ్ళు ఎర్రబారాయి, పగబట్టి బుసకొట్టే పాములాగ మాటిమాటికీ నిట్టూరుస్తున్నాడు భరతుడు.

అప్పుడు మహర్షి భరద్వాజుడు భరతుని చూసి ఒకేఒక వాక్యంలో ఇలా హితవు పలికాడు.

నాయనా భరతా! నీవు నీ తల్లి విషయంలో దోషం చూడ వద్దు. రాముడి అరణ్యగమనం లోక కళ్యాణం కొరకే. మున్ముందు సుఖకరమైన ఫలితాలు లభిస్తాయి.

అది విని భరతుడు మరొక్కమారు మహర్షికి ప్రదక్షిణం చేసి, సైన్యాన్ని కదలమని ఆజ్ఞ ఇచ్చాడు.

భరతుడు చిత్రకూటపర్వతం సమీపించాడు. అతని సైన్యం చేసే కోలాహలానికి వన్యప్రాణులు బెదిరిపోసాగాయి.

భరతుడు తన సైన్యంలోని వారికి ఆజ్ఞలు జారీ చేశాడు సీతారామలక్ష్మణుల జాడ కనుగొనమని.

అందరూ తలకొక దిక్కుగా జట్లుజట్లుగా వెదుకుట ప్రారంభించారు. వారికి ఒక చోట నుండి పొగపైకి లేస్తూ కనపడ్డది. జనులు నివసించనిచో పొగ ఎట్లా ఉంటుంది? అది ఎవరో ఒక తాపసి ఆశ్రమమో లేక రాముడి నివాసమో అయి వుంటుందని నిర్ధారణకు వచ్చి సైన్యమంతటిని ఉన్న చోటనే నిలిపి వేసి తాను వశిష్ఠ, సుమంత్రులతో కూడి ముందుకు వెళ్ళాడు భరతుడు.

చిత్రకూటపర్వతశోభలు వర్ణింపనలవిగాకుండా ఉన్నాయి. ఆ పర్వతం మీద నివాసముండటం వలన తాను ఎంతో సంతోషంగా అందరనీ మరచిపోయి ఉండగలుగుతున్నానని రాముడు సీతతో చెపుతున్నాడు. ఇద్దరూ హాయిగా ప్రకృతిని చూసి పరవశిస్తూ నడుస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు. అందమైన ప్రాంతాలను ఇంద్రుడు శచీదేవికి చూపిస్తున్నట్లుగా చూపిస్తూ ఆనందంగా విహరిస్తున్నారు ఇరువురూ!

సీతా అటుచూడు నిర్మల మందాకినీ జలాలు చూడు! ఇదుగో ఇటు చూడు ఈ పద్మమాలికలు చూడు ఎవరో కాముకులు నలిపివేసినట్లున్నదికదా! అదిగో ఆ చక్రవాకపక్షి కూతలు విను ఎంత మంగళప్రదంగా మధురంగా ఉన్నవో కదా!

సీతా రా నాతో కలిసి జలక్రీడలాడుదువుగాని! ఈ మందాకినీ నదిలోని ఎర్రనైన, తెల్లనైన పద్మాలన్నీ నీ జలక్రీడలతో నలిగిపోవాలి సుమా!

సీతా అందమైన ఈ చిత్రకూటమే అయోధ్య, ఇందులోని మృగాలే పౌరులు, ఈ మందాకినిని సరయూనదిగా భావిస్తూ నీవూ లక్ష్మణుడు తోడుంటే ఎన్ని యుగాలైనా ఇక్కడే గడిపేస్తాను.

ఇలా ఆనందంగా విహరిస్తూ ఆమెను అనునయిస్తూ ఇదిగో ఇది రుచిగా ఉంది, ఇదుగో ఇది బాగా కాలింది.. అని మాంసం తినిపిస్తూ పర్వతశిఖరంపై కూర్చున్నాడు రాముడు.

ఇంతలో ఆయనకు భరతుడి సేనచేసే కలకలధ్వనులు వినపడ్డాయి. ఆ సేనలోని అశ్వ, గజాల పదఘట్టనకు రేగిన ధూళి ఆకాశాన్ని కప్పి వేస్తూ కనపడ్డది.

సైన్యం సృష్టించిన అలజడికి అడవిలోని మృగాలన్నీ భయంతో పరుగెత్తుతూ వికృతంగా అరుస్తున్నాయి.

అప్పుడు రాముడు లక్ష్మణునితో అదేమిటో చూడమని చెప్పాడు. లక్ష్మణుడు వెంటనే ఒక సాలవృక్షాన్ని ఎక్కి నలుదెసలా పరికించి చూశాడు.

ఉత్తరం వైపు చూస్తూనే మహోగ్రంగా అన్నా! నీవు అగ్నిని చల్లార్చు, సీతమ్మను గుహలోకి భద్రంగా పంపివేయి, కవచము ధరించు! ధనుర్బాణాలను సిద్ధం చేసుకో అంటూ అరిచాడు.

లక్ష్మణా ఎందుకంత ఆవేశం! ఆ సేన ఎవరిదో సరిగా చూడు అని రాముడన్నాడు.

ఇంకెవరిది ఆ కైక కొడుకు భరతుడిది! మనల్నిద్దరినీ చంపివేయటానికే ఇంతసేనతో ఇక్కడికి వస్తున్నాడు. అదిగో కోవిదారధ్వజం స్పష్టంగా కనపడుతోంది.

ఓ మహావీరా లే! మనమిరువురం ధనుస్సులు ధరించి పర్వతం పైకెక్కుదాం. ఎవడి మూలంగా నీవు రాజ్యభ్రష్టుడవైనావో! ఆ భరతుడు వధార్హుడే, చంపివేద్దాం ఇప్పుడే!

అన్నా త్వరగా లే అంటూ... గావుకేకలు పెడుతున్నాడు లక్ష్మణుడు.

వాడితో పాటు కైకను కూడా చంపేస్తాను భూమిపై ఉన్న పాపం నేటితో తుడిచిపెట్టుకు పోతుంది! వాడి సైన్యాన్నంతా చీల్చి చెండాడతాను. ఈ చిత్రకూటమంతా రక్తపుమడుగులలో మునిగిపోవాల్సిందే ఈరోజు.. అంటూ ఆవేశపడుతున్నాడు లక్ష్మణుడు.

కోపంగా ఉన్న లక్ష్మణుడిని చూసి రాముడు శాంతంగా, వచ్చేది భరతుడే అయినప్పుడు ఇంక ధనుస్సుతో, కత్తితో, డాలుతో పని ఏముంది?

లక్ష్మణా తండ్రిమాట నిలుపుటకు అడవికి వచ్చిన నేను, నేడు నను చూడవచ్చిన భరతుని చంపి అపకీర్తి మూటకట్టుకోమంటావా!.

బంధునాశనం, మిత్రనాశనం వలన కలిగిన సంపదలు నాకు విషపుకూడుతో సమానం.

నా తమ్ములైన మీ అందరూ సుఖించి ఉండలేని రాజ్యం నాకెందుకు? నిజానికి నేను రాజ్యం కోరేది మీ అందరినీ సుఖంగా ఉంచడానికి మాత్రమే!

నేను తలుచుకొంటే సముద్రపర్యంతమైన ఈ భూమిపై ఆధిపత్యం లభించటం ఎంతసేపు? అధర్మం వలన వచ్చిన ఇంద్రపదవి కూడా నేను స్వీకరించను!.

లక్ష్మణా! నీవూ, భరతుడు, శత్రుఘ్నుడు అనుభవించలేని ఏ సుఖం నాకు కలిగినా దానిని కాల్చి బూడిదచేస్తాను.

మీ ముువ్వురితో కలిసి ఉండటంలోనే నాకు సుఖముంది!

భరతుడు ఎలాంటి వాడనుకొన్నావు?

భరతుడి గురించి ఇంతగా శంకిస్తున్నావు కదా! వాడు ఎప్పుడైనా నీకు ఇసుమంతైనా అప్రియం చేశాడా?

తాత గారి ఇంటి వద్దనుండి తిరిగివచ్చి జరిగిన విషయం తెలుసుకొని తల్లిపై కోపించి మనలను తిరిగి తీసుకువెళ్ళడానికే వస్తున్నాడు తప్ప మనమీద కత్తిదూయటానికి కాదు. అయినా, ఏ మూర్ఖుడైనా తండ్రినీ తోడబుట్టిన వారినీ చంపుకుంటాడా? భరతుడు మనసులో కూడా మన గురించి అప్రియంగా ఆలోచించలేదు.

నీవు రాజ్యం కోసమే ఈ విధంగా మాట్లాడుతుంటే భరతుడు రాగానే ఆ రాజ్యమేదో నీకే ఇవ్వమని చెపుతాను. భరతుడు మహదానందంగా ఇస్తాడు. నీవే ఏలుకుందువుగాని.

ఇంకెప్పుడూ భరతుని విషయంలో నీవు అప్రియంగా మాట్లాడరాదు.

..(సశేషం)

# పని చేస్తే లాభమెవరికి?

పనిగంటల విషయంలో ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. కంపెనీల యజమానుల్లో కొందరు ఆయన వ్యాఖ్యలను సమర్థిస్తుంటే, మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. భారత యువత వారానికి 70 గంటలు పని చేయాలని ఏడాది కాలంగా నారాయణమూర్తి వివిధ సందర్భాల్లో పనికట్టుకుని మరీ చెబుతున్నారు. తాజాగా కొద్ది రోజుల క్రితం కూడా అలాంటి మాటే చెప్పారు. ఈసారి కాంగ్రెస్ ఎంపీ, కేంద్ర మాజీమంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం నారాయణమూర్తి ప్రతిపాదనను వ్యతిరేకించడంతో ఈ అంశం తీవ్రంగా వైరల్ అయింది.

## నారాయణమూర్తి ఏమన్నారు?


మనదేశాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంచాలంటే అందరం కష్టపడి పనిచేయాలని, ముఖ్యంగా యువత దీన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ఎనభై కోట్ల మంది భారతీయులు ఉచిత రేషన్‌ను పొందుతున్నారని చెబుతూ... అంటే అంతమంది భారతీయులు పేదరికంలో ఉన్నారని, మనం కష్టపడి పనిచేసే స్థితిలో లేకుంటే ఎలా అని ప్రశ్నించారు. ఆయన ఇటీవల కోల్‌కతాలో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన సందర్భంలో ఈ విషయంపై తన అభిప్రాయాలను వెల్లడించారు. గత నెలలో సీఎన్‌బీసీ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా కూడా నారాయణమూర్తి వారానికి 70 పని గంటలు ఉండటం దేశాభివృద్ధికి ఎంతో ముఖ్యమన్నారు. వృత్తి జీవితం-వ్యక్తిగత జీవితం సమతౌల్యం అనే భావనపై తనకు నమ్మకం లేదని కొట్టిపడేశారు.

నారాయణమూర్తి వాదనను కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం తప్పుబట్టారు. దేశం పురోగతి చెందాలంటే సామర్థ్యంపై దృష్టి పెట్టాలి తప్ప సుదీర్ఘ పని గంటలపై కాదని స్పష్టం చేశారు. వారానికి నాలుగు పనిదినాలే ఉండాలన్నారు. సోమవారం మధ్యాహ్నం 12 నుంచి ప్రారంభమై శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకల్లా పని గంటలు ముగిసిపోవాలని సూచించారు. వృత్తి జీవితం- వ్యక్తిగత జీవితం మధ్య సమతౌల్యం చాలా అవసరమని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. నాసిరకం మౌలిక సదుపాయాలతో రోజువారీ జీవితం ఒక పోరాటంలా సాగుతున్నప్పుడు సుదీర్ఘంగా పనిచేయడమనేది అర్థరహితమన్నారు. నారాయణమూర్తి వాదనను కాంగ్రెస్ పార్టీ నేత గౌరవ్‌గొగోయ్ సైతం ఇటీవల విమర్శించారు. జీవితం అంటే పనిఒక్కటే కాదని, కుటుంబ పోషణ, వ్యక్తిగత సంబంధాలు కూడా ఉంటాయన్నారు. పిల్లల బాగోగులు చూడటం, వారికి తిండిపెట్టడం, చదువునేర్పడం, కుటుంబంలోని పెద్దల క్షేమం చూసుకోవడం, ఆపదల్లో ఉన్న మిత్రులను ఆదుకోవడం వంటివన్నీ జీవితంలో భాగమేనని అన్నారు.

నారాయణమూర్తి వాదనను ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్ సీఈవో నిమితా థాపర్ తీవ్రంగా ఖండించారు. ఈ అంశంపై ఇటీవల ఎంక్యూర్ సీఈవో నిమితా థాపర్, షాదీ.కామ్ వ్యవస్థాపకుడు అనుపమ్ మిట్టల్ మధ్య ఓ టీవీ సిరీస్‌లో పెద్ద చర్చ జరిగింది. అనుపమ్ మిట్టల్, నారాయణమూర్తి ప్రతిపాదనలను సమర్థించారు. జీవితంలో ఏది సాధించాలన్నా ఖచ్చితంగా కష్టపడి పనిచేయాలని, యువత పని గంటలను లెక్కించుకుంటే, జీవితంలో గొప్ప విజయాలేమీ సాధించలేరని అభిప్రాయపడ్డారు. వృత్తి జీవితం-వ్యక్తిగత జీవితం మధ్య సమతౌల్యం అనే భావన ప్రస్తుత యువతరాన్ని పూర్తిగా నాశనం చేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఉద్యోగులకు కలిగే లాభమేంటి?

అనుపమ్ మిట్టల్, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి అభిప్రాయాలతో నిమితా థాపర్ విబేధించారు. ఉద్యోగులు ఎక్కువ గంటలు పనిచేస్తే కంపెనీ వ్యవస్థాపకులకు, యజమానులకు, వాటాదారులకు పెద్దఎత్తున లాభాలు వస్తాయి తప్పించి ఉద్యోగులకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనం ఉండదని ఆమె స్పష్టంచేశారు. "టన్నుల కొద్దీ డబ్బులు సంపాదించే వ్యవస్థాపకులు, హైస్టేక్‌హోల్డర్లు కావాలంటే 24 గంటలూ పనిచేయండి. కానీ, సామాన్య ఉద్యోగులను వదిలేయండి. వారు నిర్దేశిత గంటల పాటు పనిచేసినా మీకు మంచి ఉత్పాదకతను అందిస్తారు. కానీ, నాణ్యత లేకుండా నాన్‌స్టాప్‌గా ఎక్కువ గంటలపాటు పని చేయించకూడదు. ఒకవేళ అలా పనిచేయిస్తే, వారికి అనేక ఆరోగ్య, మానసిక సమస్యలు వస్తాయే కానీ, ప్రత్యేకంగా ఎలాంటి ఆర్థిక లబ్ధి చేకూరదు." అని కుండబద్దలు కొట్టారు. 'ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్‌లో మాకు దాదాపు 80శాతం వాటా ఉంది. అందువల్ల సహజంగానే మేము రోజుకు 20 గంటలు పనిచేస్తాం. అందువల్ల వచ్చే లాభాలు కూడా మాకే దక్కుతాయి. కానీ, మా కంపెనీలో పనిచేసే సాధారణ ఉద్యోగికి ఆ లాభాలు పంచం." అని తేల్చిచెబుతూ అలాంటప్పుడు వారిని కూడా యజమానులతో సమానంగా పని చేయాలని ఎలా ఆదేశిస్తారని నిలదీశారు. మొత్తంమీద పనిగంటల విషయం దేశవ్యాప్తంగా మరోసారి తీవ్ర చర్చనీయాంశమయింది. ఎక్కువసేపు పనిచేయడం అనేది వ్యక్తిగత ప్రాధాన్యాంశంగా వదిలేయాలి తప్పించి బలవంతంగా రుద్దితే వచ్చే ఫలితమేమీ ఉండదు. గుర్రాన్ని చెరువు వద్ద వరకు తీసుకెళ్లగలం కానీ, దాంతో నీరు తాగించలేం.. అని మనకు అనుభవజ్ఞులు చెప్పిన సామెతను ఇన్ఫోసిస్ నారాయణమూర్తి గుర్తుచేసుకోవాలి. ఉత్పాదకత, ఎక్కువ పని గంటల గురించి చైనా, జపాన్ తదితర దేశాలను ఉదాహరణగా చూపిస్తున్న నారాయణమూర్తి అక్కడ వాటి ఫలితంగా ఎదురైన సామాజిక సమస్యల గురించి మరచిపోయినట్లున్నారు. వృత్తిజీవితం-వ్యక్తిగత జీవితం సమతౌల్యం లోపిస్తే కుటుంబ జీవితం విచ్ఛిన్నమై దేశం తీవ్ర సామాజిక సంక్షోభానికి గురవుతుందన్న సంగతి ఆయన గుర్తించడం లేదు. మన దేశానికి కుటుంబ వ్యవస్థే శ్రీరామరక్ష. దాన్ని ఛిన్నాభిన్నం చేసుకుంటే దేశం ఎంత జీడీపీ సాధించినా, కంపెనీలు ఎన్ని లాభాలు గడించినా ప్రయోజనం ఉండదు. సమాజంలో అశాంతి ఉన్నప్పుడు డబ్బుకు విలువ ఉండదు.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# రక్తికడుతున్న రాజకీయ సినిమా!

(మొదటిపేజీ తరువాయి)





సినీ ప్రముఖులు ఇంటికెళ్లి సంఘీభావం తెలపడం చకచకా జరిగిపోయాయి. ఇదంతా రాజకీయ సినిమాలో ఇంట్రడెక్షన్ అనుకుంటే.. ఆ తర్వాత జరిగినదంతా పెద్ద రచ్చ రంబోలానే.. అసలు సినిమా ఇక్కడి నుంచే ప్రారంభమైంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా సంధ్య థియేటర్ ఘటనపై శివాలెత్తిపోయారు. హీరో అల్లు అర్జున్, పుష్ప టీంను మాత్రమే కాకుండా... ఏకంగా సినిమా ఇండస్ట్రీ మొత్తాన్ని ఉతికి ఆరేశారు. మానవత్వం లేని మనుషులంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇబ్బడిముబ్బడిగా.. ఇష్టారాజ్యంగా వ్యక్తులను స్తుతిస్తూ.. కథలు రూపొందించి ప్రజల నుంచి డబ్బులు దండుకోవడమే కాకుండా.. బెనిఫిట్ షోలు, అదనపు స్క్రీన్‌లు అంటూ ప్రజల ప్రాణాలతో అడుకుంటే సహించబోమన్నారు. సినీరంగంలోని వారేమన్నా దేవుళ్లా? రైతులు, జవాన్ల కంటే గొప్పవారా? అని ప్రశ్నలు సంధించారు. తాను సీఎం కుర్చీలో ఉండగా సినిమావాళ్ళ ఆటలు సాగనివ్వనంటూ హూంకరించారు. ఇకపై టికెట్‌రేట్ల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతించబోమంటూ తేల్చి చెప్పేశారు. ఇదే సమయంలో అనుమతి లేకుండా సినిమా థియేటర్‌కు రావడమే కాకుండా కారుపై రోడ్‌షో చేశారంటూ అల్లు అర్జున్ తీరును ఎండగట్టారు. కొన్ని గంటలు జైలులో గడిపిన హీరోను పరామర్శించేందుకు ఉన్న తీరిక.. బాధిత కుటుంబాన్ని, ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న పిల్లాడిని చూసేందుకు లేదా..? అంటూ సినీ పెద్దలను నిలదీశారు. దీంతో ఇండస్ట్రీలో ఒక్కసారిగా తీవ్ర అలజడి మొదలైంది.

ఇదే సమయంలో తనపై వస్తున్న విమర్శలు అర్థరహితమని, సంధ్య థియేటర్‌లో ఓ మహిళ చనిపోవడం దురదృష్టకరమైన ఘటనని, తన వ్యక్తిత్వాన్ని హననం చేసే విధంగా కొందరు తప్పుడు సమాచారంతో మాట్లాడడం ఆవేదనకు గురిచేసిందని అల్లు అర్జున్ మీడియా ఎదుట మాట్లాడడంతో వివాదం చినికి చినికి గాలివానలా మారింది. అప్పటినుంచి జోరందుకున్న రాజకీయ సినిమాలో రేవంత్‌రెడ్డి, అల్లు అర్జున్ ప్రధానపాత్రధారులు కాగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, పోలీసులు సహాయ పాత్రలు పోషిస్తూ కథను రక్తికట్టించారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి నేతలు.. ముఖ్యంగా జనసేన నాయకులు అల్లు అర్జున్ టార్గెట్‌గా విమర్శలు చేయడం, సందట్లో సడేమియా అంటూ వైఎస్సార్సీపీ నాయకులు అల్లు అర్జున్ అరెస్టు అక్రమం అంటూ సన్నాయినొక్కులు నొక్కడం, మెగా ఫ్యామిలీ నుంచి డైలాగ్‌లేని యాక్షన్ స్వీకెన్సులు రావడంతో.. పుష్ప-2 ఎపిసోడ్ అచ్చమైన పొలిటికల్ థ్రిల్లర్‌ను తలపిస్తోంది.. మరి దీనికి క్లైమాక్స్ ఎప్పుడో.. శుభం కార్డు ఏ రూపంలో పడుతుందో అన్న మహా ఉత్కంఠ రాజకీయ సినీ రంగాల అభిమానులలో కలిగిస్తోంది!

తెలుగు రాష్ట్రాల్లో పుష్ప-2 సినిమా వివాదం అంతకంతకూ తీవ్రమవుతోంది. అంతూదరీలేని విధంగా.. ఎప్పుడు ఎవరు ఎలా స్పందిస్తారో అర్థం కాకుండా.. ఏ క్షణాన ఏం జరుగుతుందో ఊహించలేని విధంగా పెద్దదవుతోంది. మొదట రేవంత్ వర్సెస్ అల్లు అర్జున్ అంటూ ప్రారంభమైన వ్యవహారం ప్రస్తుతం అన్ని పార్టీల నాయకులు తలోచేయి వేయడంతో ముదిరి పాకానపడింది.

## ‘పుష్ప’విలాపానికి కారణం అదేనా..?

కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్లు.. సంధ్య థియేటర్ ఘటనలో హీరో అల్లు అర్జున్ టార్గెట్ కావడానికి కూడా అనేక కారణాలు కనిపిస్తున్నాయి. నిజానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సినీరంగ ప్రముఖులపై గుర్రుగా ఉందనే వాదనలున్నాయి. దీనికి ప్రధాన కారణం గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు, ముఖ్యంగా కేటీఆర్‌తో సినీ ప్రముఖులు సన్నిహితంగా ఉండడం, కనీసం తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఏ సినీ సెలబ్రెటీ తమను కలవకపోవడం, శుభాకాంక్షలు చెప్పకపోవడం బాధించిందని తెలంగాణ సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అప్పట్లోనే వాపోయారు. అదే క్రమంలో ఎన్నికల సమయంలోనూ నాగార్జున వంటి హీరోలు కేసీఆర్, కేటీఆర్‌కు మద్దతుగా వ్యాఖ్యలు చేయడంతో, కాంగ్రెస్ వారిపై కత్తికట్టిందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో సినిమా వివాదం ఏదైనా... చట్టం తనపని తాను చేసుకుపోతుందనే రీతిలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. సినిమా హీరోలు కూడా అందరిలాంటి వారేనని, చట్టాన్ని వారిపై కూడా కఠినంగా అమలు చేస్తామనేలా చర్యలు చేపడుతున్నారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్‌ను అకస్మాత్తుగా కూల్చివేయడం, మోహన్ బాబు కుటుంబ గొడవల్లో హీరోలు మంచు విష్ణు, మంచు మనోజ్‌లకు పిలిచి వార్నింగ్ ఇవ్వడం, మీడియాపై దాడి కేసులో ఏకంగా మోహన్‌బాబుపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయడం వంటివి వీటికి మచ్చుతునకలుగా కనిపిస్తున్నాయి.

ఇలాంటి సమయంలో పుష్ప - 2 సక్సెస్ మీట్‌లో హీరో అల్లు అర్జున్ మాట్లాడే సమయంలో తెలంగాణ సీఎం అంటూ పేరు మరిచిపోయేలా తడబడడం రేవంత్‌రెడ్డి ఈగోను హర్ట్ చేసిందనే వాదనలు వినిపిస్తున్నాయి. దాని ఫలితమే అల్లు అర్జున్‌పై తీవ్రస్థాయి వ్యాఖ్యలు చేయడంతో పాటు సంధ్య థియేటర్ ఘటనపై నమోదైన కేసులో అల్లును ఏ11గా చేర్చడం జరిగిందని పలువురు భావిస్తున్నారు. శుక్రవారం అదుపులోకి తీసుకుని శని, ఆదివారాల్లో జైలులో ఉంచే వ్యూహానికి కూడా అదే కేంద్రబిందువుగా ఉండి ఉంటుందని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

## ఆజ్యం అక్కడేనా..?

ఆరు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో నంద్యాల వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి రవిచంద్రా రెడ్డికి అల్లు అర్జున్ బహిరంగంగా మద్దతు ప్రకటించడం, ఇంటికి వెళ్లి మరీ నిబద్ధత ఉన్న నేత అంటూ ఆయనని పొగడడం చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమిని కాకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికేలా అల్లు అర్జున్ ప్రవర్తిస్తున్నాడని అప్పట్లో పెద్దఎత్తున చర్చజరిగింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వంతో పాటు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అల్లు అర్జున్‌పై కక్ష పెంచుకుందని ప్రస్తుతం పుష్ప-2 వివాదం, అల్లు అర్జున్‌పై చర్యలకు ఇక్కడే ఆజ్యం పడిందని భావిస్తున్నారు.

## స్క్రిప్ట్ ఏపీ నుంచేనా..?

అల్లు అర్జున్‌పై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరించడానికి అవసరమైన స్క్రిప్ట్ ఆంధ్రప్రదేశ్ నుంచే వెళ్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తన శిష్యుడు రేవంత్‌రెడ్డి ద్వారా అల్లు అర్జున్‌ను చంద్రబాబు టార్గెట్ చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో పవన్ కల్యాణ్ కూడా మిన్నకుండిపోయినట్లు తెలిసింది. దీంతో అల్లు కుటుంబం ఒంటరి అయ్యిందనే పుకార్లు కూడా తెరపైకి వస్తున్నాయి.

ఇక ఓ వర్గం మీడియా సైతం అల్లు అర్జున్ టార్గెట్‌గా వార్తలు ప్రచురిస్తోందని, వీలైనంతగా అల్లు వ్యక్తిత్వ హననానికి పాల్పడి ఆయన ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వార్తలు ప్రచురిస్తోందనే విమర్శలూ లేకపోలేదు. ఇక జనసేన నేతలైతే ఒకడుగు ముందుకేసి ఎప్పటికప్పుడు మీడియా ముందు అల్లు అర్జున్‌ను కించపరచడంతో పాటు, అల్లుకి మానవత్వమే లేదంటూ విరుచుకు పడుతున్నారు. దీంతో రేవంత్‌రెడ్డి భుజాలపై తుపాకీ పెట్టి ఆంధ్రాలోని కూటమి ప్రభుత్వం అల్లు అర్జున్‌పై గురిపెట్టిందన్నది మరికొందరి అభిప్రాయం.

## ఇండస్ట్రీ ఏకమవుతుందా?

గతంలో ముఖమంత్రిగా ఉన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చిరంజీవి నేతృత్వంలో కలిసేందుకు వచ్చిన టాలీవుడ్ పెద్దలను ఆయన అవమానించారంటూ కొందరు టాలీవుడ్ ప్రముఖులు గగ్గోలు పెట్టారు. సరైన సమయంలో జగన్‌ను దెబ్బతీసే క్రమంలో ఇటీవలి ఎన్నికల్లో తమవంతుగా కూటమి పక్షాలకు సాయం అందించారనే వాదనలూ ఉన్నాయి. ఇక ప్రస్తుత అల్లు వర్సెస్ రేవంత్‌రెడ్డి వివాదంలో ఏం మాట్లాడితే ఏం అవుతుందో అనే ఆందోళనలో కొందరు మిన్నకుండిపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో ఆంధ్రాకు టాలీవుడ్ ఇండస్ట్రీ తరలిపోతుందనే వాదనను తీసుకొచ్చి తెలంగాణ ప్రభుత్వాన్ని కొంత మేర కట్టడిచేయాలని ఆదిశగా ప్రయత్నాలు ప్రారంభించాల్సిన అవసరం ఉందని మరికొందరు మాట్లాడుకుంటున్నట్లు వార్త. ఏదేమైనా, గోటితే పోయే విషయాన్ని గొడ్డలి దాకా తెచ్చుకున్నారనే అపవాదు లేకుండా అల్లు అర్జున్ కూడా ఇక్కడ పరిణితి ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. ముద్దయిగా కోర్టు మధ్యంతర బెయిల్‌పై ఉన్న వ్యక్తి ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడడం సమంజసమైన విషయం కాదు. పైగా అసెంబ్లీలో సాక్షాత్తూ ముఖ్యమంత్రి సరైన సమాచారం లేకుండా మాట్లాడారేమో అంటూ పేరు చెప్పకుండానే వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. దీంతో పోలీసులు సైతం 10 నిమిషాల నిడివితో వీడియో విడుదల చేసి తప్పంతా అల్లు అర్జున్‌దే అన్నట్లు తేల్చేశారు. నిజానికి కోర్టులో ఉన్న విషయంపై అల్లు అర్జున్ మాట్లాడడం ఎంత తప్పో.. పోలీసులైనా, నాయకులైనా మాట్లాడడం కూడా అంతే తప్పు.. పోలీసులు తమ ఆధారాలను కోర్టుకు సమర్పించాలి కానీ.. మీడియా ముందు పెట్టడం సరికాదు.

## రాజుగారి రాయబారం!

ఇక ఇటీవల అమెరికా పర్యటన నుంచి తిరిగొచ్చిన తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ ఛైర్మన్ దిల్ రాజు సమస్యను చక్కదిద్దేందుకు సమాయత్తమయ్యారు. ఇప్పటికే ఆయన సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడినట్లు తెలిసింది. ఇక బాధిత కుటుంబానికి ఆయన పుష్ప-2 టీంతో కలిసి రూ.2 కోట్ల సాయాన్ని ప్రకటించారు.

ఈ నేపథ్యంలో టాలీవుడ్ హీరోలు, దర్శకులు, నిర్మాతలతో కలిసి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఇండస్ట్రీలో ఉండే సమస్యలతో పాటు బెనిఫిట్ షోల రద్దు విషయంపై పునరాలోచించాలని కోరారు. ఇక అల్లు అరవింద్‌తో పాటు మైత్రీ మూవీస్ నిర్మాతలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్న నేపథ్యంలో సంధ్య థియేటర్ ఘటనపై తెలంగాణ సర్కారు తీరు ఎలా ఉండబోతోంది?.. మొత్తానికి ఈ రాజకీయ సినిమా కథ అనేక మలుపులు తిరుగుతూ, సస్పెన్స్ థ్రిల్లర్ క్రైమ్ స్టోరీగా రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలలో ఉత్కంఠ రేపుతోంది. తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి భర్త భాస్కర్ సమయం దొరికినప్పుడల్లా మీడియాతో మాట్లాడుతూనే ఉన్నారు. అల్లు అర్జున్ ఎప్పటికప్పుడు తన కుమారుడు శ్రీతేజ్ ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారని, అవసరమైతే అల్లు అర్జున్‌పై కేసు వెనక్కి తీసుకునేందుకు కూడా సిద్ధమని కూడా ఆయన ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో ఈ కథకి శుభం కార్డు ఎలా పడబోతోందో రాజకీయ తెరపై వేచిచూడాలి!



### నృసింహస్వామి సన్నిధిలో..
## శ్రీరంగం ఆండవన్ స్వామి



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై వెలసివున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయాన్ని ఈనెల 22న శ్రీరంగం శ్రీమత్ పరవక్కోటై 11వ పీఠాధిపతి చిన్న ఆండవన్ స్వామివారు సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, అధికారులు స్వామీజీని సాదరంగా స్వాగతించి, ఆలయ చరిత్రను, ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆలయ ఇఓ గోపి ఆధ్వర్యంలో ఆండవన్‌స్వామిని ఘనంగా సత్కరించారు. అనంతరం స్వామివారు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ, దశావతారాల్లో ఆ భగవంతుని నృసింహావతారం ప్రత్యేకతను వివరించారు. విద్యార్థులకు హయగ్రీవ స్తోత్రం ప్రాధాన్యతను విశదీకరించారు. ధనుర్మాసంలో ఈ వేదగిరి క్షేత్రాన్ని సందర్శించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, కృష్ణమాచార్యులు, మురళీధరాచార్యులు, రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త డీఎంఅండ్‌హెచ్‌ఓగా.. డాక్టర్ సుజాత



జిల్లా వైద్యారోగ్యశాఖ (డిఎం అండ్ హెచ్‌ఓ) అధికారిణిగా డాక్టర్ సుజాత ఈనెల 23న నెల్లూరులోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లాలోని ఆత్మకూరు రూరల్ హెల్త్ సెంటర్ డెప్యూటి సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న ఆమె, ఉద్యోగోన్నతిపై నెల్లూరుజిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణిగా నియమితులయ్యారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా చెప్పారు.

### డౌనీహాలులో వేడుకగా..
## క్రీస్తు గాన జయంతి



క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 22న నెల్లూరు విఆర్‌సి కూడలిలోని ప్రముఖ బాప్టిస్టు చర్చి డౌనీహాలులో క్రీస్తు గాన జయంతి కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. కెవిన్ క్రిస్టోఫర్ రచించిన గీతాలకు గుర్రం సుధాకర్‌రావు, జమ్ముల జయకుమార్, జి.అరుణ్‌కుమార్, బిల్లీశ్యాంసన్‌లు స్వరకల్పన చేసి సంగీతం సమకూర్చారు. దారా సురేష్, రమేష్, శాంతి, ప్రకాష్, పీజే జ్యోయల్‌శ్యామ్, ఖాదర్‌బాషా, సాయి వాద్య సహకారం అందించారు. రెవరెండ్ కె.శ్యాంసన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రెవరెండ్ డా.జొనాథన్ వాక్యోపదేశం చేశారు. కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, క్వైర్ డైరెక్టర్ బిల్లీశ్యాంసన్ సారధ్యంలో గాయనీగాయకులు ఏసుక్రీస్తు భక్తిపాటలను ఆలపించారు. గంటా థామస్ మౌంట్‌బాటన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఛైర్మెన్ డి.సురేంద్ర, కోశాధికారి విజయభాస్కర్ పాల్గొన్నారు.

## డాక్టర్ ఏవీఎస్ సతీమణి కన్నుమూత



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా శాఖ మాజీ ఛైర్మెన్ డాక్టర్ ఏవీ సుబ్రహ్మణ్యం సతీమణి డాక్టర్ ఏవి ఉమాసుందరి ఈనెల 23వ తేదీ సోమవారం ఉదయం కన్నుమూశారు. ఆమె మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఆమె ఆత్మకు శాంతికి చేకూరాలంటూ రెడ్‌క్రాస్ సొసైటీ వారు ఒక ప్రకటనలో తమ సంతాపం తెలిపారు.

## ఆనం చేతులమీదుగా.. లబ్ధిదారులకు చెక్కులు



రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతులమీదుగా ఇటీవల ఆత్మకూరు నియోజకవర్గంలోని 9 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ జరిగింది. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు నియోజక వర్గపరిధిలోని 11 మంది బాధిత కుటుంబాల లబ్ధిదారులకు రూ.11.18 లక్షలు విలువైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందిస్తూ, వారికి అండగా నిలుస్తున్నామన్నారు. అనంతరం, ఆ సాయం అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, మంత్రి ఆనంకి తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధి బృందం



జపాన్‌లోని టొయామా రాష్ట్రానికి చెందిన 16 మంది సభ్యుల ఉన్నతశ్రేణి ప్రతినిధి బృందం ఇటీవల శ్రీసిటీని సందర్శించింది. టొయామా అసోసియేషన్ ఆఫ్ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్స్ ఛైర్మెన్, హొకరికు బ్యాంక్ సీనియర్ సలహాదారు హిడెనోరి ముగినో ఆ బృందానికి నేతృత్వం వహించారు. వారికి శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. 30కి పైగా జపాన్ కంపెనీల ఏర్పాటుతో శ్రీసిటీ దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా అవతరించిందన్నారు. అనంతరం, శ్రీసిటీలోని జపనీస్ ఎంక్లేవ్‌ను, శ్రీసిటీ పరిసరాలను వారు సందర్శించి శ్రీసిటీలోని వ్యాపార అనుకూల వాతావరణాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో ఈ ప్రాంతంలో జపనీస్ వ్యాపార వృద్ధి మరింత పెరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో, వారి పర్యటన పట్ల సంతోషం వ్యక్తంచేశారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఈ తరహా సందర్శనలు ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక సంబంధాలను బలపరుస్తాయని పేర్కొన్నారు. ఈ బృందంలో 11 మంది సీనియర్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లు, నలుగురు టొయామా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో) ప్రతినిధి పాల్గొన్నారు.

## కంచి పరమేశ్వరరెడ్డి ఔదార్యం

- **మృతుల కుటుంబాలకు 80వేల సాయం**



ఆత్మకూరుకు చెందిన సాంబ శివా చారిటబుల్ ట్రస్ట్ అధినేత, నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి అనేక మంది బాధిత పేద కుటుంబాల వారికి సాయం అందజేస్తూనే ఉన్నారు. ఇటీవల ఆత్మకూరు పట్టణంలోని పలు వార్డుల్లో వివిధ కారణాలతో మరణించిన నిరుపేదకుటుంబాల వారికి 10వేల రూపాయల వంతున 10 మంది కుటుంబాలకు ఆర్థికసాయం అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. 1వ వార్డుకు చెందిన ఏసుపోగు పెంచలయ్య, పోతల రాగయ్య (4వ వార్డు), షేక్ కరిముల్లా (7వ వార్డు), కామిశెట్టి రామచంద్రరావు (9వ వార్డు), తంగెళ్లపల్లి లక్ష్మమ్మ (11వ వార్డు), శాగలమూడి పెంచలయ్య (13వ వార్డు), కొమరగిరి నారమ్మ (15వ వార్డు), పఠాన్‌బాబు (23వ వార్డు)లు మరణించగా, వారి కుటుంబాలకు సాయం అందించి ఆదుకున్నారు. ఈనెల 22న ట్రస్ట్ సభ్యులు కేవీ శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, ఏ.నరసింహారెడ్డిలు మృతులకుటుంబాల వారివద్దకు వెళ్ళి, పరామర్శించి పరమేశ్వరరెడ్డి పంపిన సాయాన్ని వారికి అందించడంతో, బాధితులు పరమేశ్వరరెడ్డికి, ట్రస్టు సభ్యులకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

## కోవెరపాళెంలో ఉచిత నేత్రవైద్య శిబిరం



సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో, ఎల్‌వి ప్రసాద్ నేత్రవిజ్ఞాన సంస్థ సౌజన్యంతో తెలుగుయువత ప్రధానకార్యదర్శి గంగపట్నం సుధీర్‌బాబు ఆధ్వర్యంలో ఈనెల 23న తోటపల్లిగూడూరు మండలం కోవెరపాళెం గ్రామంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు చేశారు. ముత్యాల గణేష్, గంగపట్నం శేఖర్, వెంకటసుబ్బయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### విడవలూరులో అంకమ్మతల్లికి విశేష అభిషేకాలు

మండల కేంద్రమైన విడవలూరులో వెలసివున్న శ్రీ అంకమ్మ అమ్మవారికి ఆలయ అర్చకులు ఈనెల 22న దుర్గాదేవి అలంకారం నిర్వహించి విశేషపూజలు, అభిషేకాలు చేశారు. గ్రామస్తులంతా సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా భక్తమండలి వారి భజనలు, భక్తిగీతాలాపనలతో ఆలయం సందడిగా మారింది.

### చెముడుగుంటలో గణిత దినోత్సవ వేడుకలు

వెంకటాచలం మండలం చెముడుగుంటలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో ఈనెల 22న జాతీయ గణిత దినోత్సవ వేడుకలు జరిగాయి. ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త డా. శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి వక్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, డిసిఇబి కార్యదర్శి రామ్ కుమార్, పూంధ్ల రమేష్, చలపతి, రమేష్ పాల్గొన్నారు.

### బుచ్చి చర్చిలో ప్రీ-క్రిస్మస్ వేడుకలు

బుచ్చిరెడ్డిపాళెంలోని లేమెన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ చర్చిలో ఈనెల 23న ప్రీ-క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాస్టర్ జయరావు ఆధ్వర్యంలో చర్చిని విద్యుత్‌దీపాలతో అలంకరించి, ఏసుక్రీస్తును ఆరాధిస్తూ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని కేకు కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ సంతోషంగా గడిపారు.

### గొల్లపాళెం ఆశ్రమానికి 50వేల వితరణ

క్రిస్మస్ పండుగ సందర్భంగా అల్లూరు మండలం గొల్లపాళెంలో ఉన్న ఆశ్రమ పాఠశాలకు కోవూరు న్యూ లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరెస్పాండెంట్ కిషోర్-అనిత దంపతులు ఈనెల 23న రూ.50వేలు వితరణగా అందించారు. ఎంతోమంది చిన్నారులకు ఆశ్రయం కల్పిస్తున్న నిర్వాహకులు రామచంద్ర శరత్‌ను అభినందిస్తూ, వారు తమ విరాళాన్ని ఆయనకు అందజేశారు.

### బట్టేపాడులో కోడిపందేలపై పోలీసుల దాడులు

ఆత్మకూరు మండలం బట్టేపాడులో కోడిపందేల స్థావరాలపై ఈనెల22న పోలీసులు దాడులు చేశారు. సీఐ జి.గంగాధర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ఎస్‌కె జిలాని, సాయిప్రసాద్, శ్రీనివాసరెడ్డి పాల్గొని కోడిపందేలాడుతున్న అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. 8 కోళ్ళతో పాటు, అక్కడున్న 19 మోటార్‌బైక్‌లను కూడా స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### మనుబోలులో జాతీయ రైతు దినోత్సవం

జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ఈనెల 23న మండల కేంద్రమైన మనుబోలులో రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి రాయపాటి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులకు కృతజ్ఞతాపూర్వక కార్యక్రమం నిర్వహించారు. రైతే దేశానికి వెన్నెముక అని, ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తూ ప్రజలకు ఆహారం అందిస్తున్న రైతన్నల సేవలు విస్మరించరానివన్నారు.

### కసుమూరులో విద్యార్థులకు స్టడీ మెటీరియల్

వెంకటాచలం మండలం కసుమూరు జడ్పీ హైస్కూలులో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 23న నెల్లూరుకు చెందిన బెజవాడ సునీల్‌రెడ్డి (వీసీ సుబ్బారెడ్డి స్టేడియం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు) ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీచేశారు. యుటిఎఫ్ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. హెడ్మాస్టర్ వీవీ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

### టపాతోపు నివాసులకు ఇళ్ళపట్టాలు ఇవ్వండి

కొడవలూరు మండలం నార్త్‌రాజుపాళెం పంచాయతీ పరిధిలోని టపాతోపు కాలనీ వాసులకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని కోరుతూ జిల్లాగ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మెన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకుడు కె.మల్లికార్జున్‌లు ఈనెల 23న తహశీల్దార్ స్ఫూర్తిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు బాబి, మోహన్‌రావు పాల్గొన్నారు.

### కోవూరులో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు పోలీసులు ఈనెల 22న కౌన్సిలింగ్ ఇచ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. రౌడీయిజం మానుకొని, ప్రతిఒక్కరూ సత్ప్రవర్తనతో జీవించాలని హితవు చెప్పారు.

## శ్రీవారి సేవకులలో.. భక్తి నాస్తి.. అహం జాస్తి

# వెంకన్న భక్తులకు.. 'కొండ'ంత కష్టం



**అయితే, ఇదంతా నాణేనికి ఒకవైపే.. అనే వాదనలూ వినిపిస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే అదే నిజం కూడా. వందలాది కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న భక్తులందరూ ప్రశాంతంగా, సంతృప్తికరంగా స్వామివారిని దర్శించుకుంటున్నారా అంటే లేదనే చెప్పాలి. కొండపై చాలా సందర్భాల్లో వీరికి టీటీడీ సిబ్బంది నుంచి విసుర్లు, ఛీత్కారాలు, నిర్లక్ష్యపూరిత సమాధానాలే ఎదురవుతున్నాయి. ముఖ్యంగా స్వామి దర్శన సమయంలో.. శ్రీవారి ఆలయం లోపల విధులు నిర్వహించే కొందరు ఉద్యోగుల ప్రవర్తన కారణంగా భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఎంతో భక్తిభావంతో చేసే తిరుమల ఆధ్యాత్మిక ప్రయాణంలో కొంతమంది సిబ్బంది అత్యుత్సాహంతో పెడుతున్న ఇబ్బందులు భక్తులను క్షోభకు గురి చేస్తున్నాయి. లిప్తపాటు కాలం కూడా స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించలేకపోయామంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

ఆపదమొక్కుల స్వామి కొలువైన తిరుమల కొండపై గత కొన్నేళ్లుగా భక్తులకు ప్రశాంతత కరువైంది. ఆధ్యాత్మిక చింతనతో కొండకు వస్తున్న భక్తులపై తిరుమల తిరుపతి దేవస్థానం సిబ్బంది పెత్తనం చెలాయించే రీతిలో మంచి మర్యాద లేకుండా వ్యవహరిస్తున్నారు. కొంతమంది ఉద్యోగులు శృతిమించి అంతరాలయంలోనే కేకలు పెడుతుండగా.. మరికొందరు భక్తులను నిర్దాక్షిణ్యంగా నెట్టేస్తున్నారు. ఫలితంగా ఆలయ ప్రాంగణంలో గోవింద నామస్మరణ కంటే.. సిబ్బంది గోలే ఎక్కువవుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. నిజానికి వేదాలే శిలలుగా వెలసిన కొండ... భక్తకోటి ముక్తకంఠంతో ఎలుగెత్తి పిలిచే కొండ... తిరుమల. శేషాచల కొండలపై ఉన్న శ్రీవారి దర్శనం కోసం భక్తులు తహతహలాడిపోతారు. పైసా పైసా పోగుచేసి స్వామి వారి హుండీలో వేసి, మొక్కులు తీర్చుకుంటారు. నిలువు దోపిడీ సమర్పించి అంతా స్వామివారే చూసుకుంటారు అనుకుంటూ ఆనందంగా కొండ దిగుతారు. పురాతన కాలం నుంచి ఎంతో మంది రారాజులు స్వామివారికి సేవకులై తరించారు. అనేకమంది నాయకులు, అధికారులు స్వామివారి పట్ల అనంత భక్తిప్రపత్తులతో ప్రణమిల్లారు. అయితే గత ఐదేళ్లలో తిరుమలలో దోపిడీ ఇష్టారాజ్యంగా కొనసాగిందనే వాదనలున్నాయి. కొండ మీద వ్యాపారం తప్ప ఇంకేమీ సాగలేదన్నది జగ(న్) మెరిగిన సత్యం.





అయితే ఇప్పుడు పరిస్థితి మళ్లీ గాడిలోపడినట్టే. ప్రక్షాళన ప్రారంభమయ్యిందని పలువురు భావిస్తున్నారు. వ్యాపారానికి పరాకాష్టగా మారిన శ్రీవాణి ట్రస్ట్‌ను రద్దుచేశారు. తిరుపతి స్థానికులకి మూడు నెలలకోసారి దర్శనాల సౌలభ్యాన్ని పునః ప్రారంభించారు. తిరుమలలో అన్యమతస్తులు లేకుండా, వారికి అన్యాయం జరగకుండా సముచిత నిర్ణయాలు తీసుకున్నారు. అన్నదానం సౌకర్యవంతంగా, శుచిగా, రుచిగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం మరింత సులభతరం చేసే దిశగా నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. ఇప్పటికే కొన్నింటిని ఆచరణలో కూడా పెట్టారు. మొత్తంమీద గత ఐదేళ్లుగా ఉన్న టిక్కెట్లు, గదుల వ్యాపారాలు మూతబడ్డాయి. అయితే ప్రశాంత మైన దర్శనం మాత్రం సామాన్య భక్తుడికి దుర్లభంగా మారు తోంది.







## ఉత్సాహంతో వస్తూ.. ఉసూరుమంటూ వెళ్తూ!

శ్రీనివాసా గోవిందా... శ్రీ వేంకటేశా గోవిందా భక్తవత్సలా గోవిందా... భాగవతప్రియ గోవిందా... అంటూ వేంకటేశ్వరుని మాల ధరించేవారు.. ముడుపులు చెల్లించేవారు.. మొక్కులు తీర్చుకునేవారు.. తలనీలాలు సమర్పించుకునేవారు.. పెళ్లి కావలసినవారు, పెళ్లయిన వారు.. పిల్లలు పుట్టని వారు, పిల్లలు పుట్టినవారు.. కోరికలు తీరనివారు, కోరికలు తీరినవారు.. చిన్నపిల్లలు, యువతీయువకులు, మధ్య వయసువారు, వయసు నిండినవారు, తలలు పండినవారు ఇలా రకరకాల భక్తులు లక్షల సంఖ్యలో స్వామివారి సేవకోసం నిత్యం తిరుమలకి వస్తూనే ఉంటారు. కోరికొలిచిన వారికి కొంగుబంగారమైన తిరుమల కొండకు రావటం ప్రతిభక్తునికి జీవితంలో మరువలేని అనుభూతి. వాళ్లందరికీ సంతృప్తికరమైన స్వామి దర్శనం లభిస్తుందా.. అంటే, లేదనే సమాధానమే అధిక శాతం భక్తుల నుంచి వినపడుతోంది.

## అలసి సొలసి స్వామివారి ముందు నిలిచి!

ఇందుకు ఉదాహరణ.. ఇటీవల శ్రీకాకుళం నుంచి ఓ పేద భక్తుడి కుటుంబం స్వామి వారికి సమర్పించాలని, ఏడాది ముందే ముడుపు కట్టుకుంటుంది. ఇంట్లో హుండీ పెట్టి కడుపు మాడ్చుకుని స్వామి వారి కోసం పైసా పైసా పోగు చేస్తుంది. రైలు రిజర్వేషన్ అయితే ధర ఎక్కువని జనరల్ కంపార్ట్‌మెంట్‌లో తిరుపతి చేరుకుంటుంది. రాత్రంతా నిద్ర ఉండదు. నడిచివెళ్లి స్వామి దర్శనం చేసుకోవాలన్నది ఆ కుటుంబం సంకల్పం. ఆ తర్వాత దర్శనానికి వెళితే... గంటల తరబడి క్యూలైన్లలో పడిగాపులు. ఇంతా చేసి స్వామివారి ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించ గానే వెనుక భక్తులు తోస్తారు. ఆలయంలో ఉండే కాపలా బృందం స్వామిని కనులారా చూడనీయకుండా నెట్టేస్తారు. గోవింద నామాలు వినపడాల్సిన చోట కదలండి... వెళ్లండి అంటూ అరుపులు వినపడ తుంటాయి. భక్తుల్ని స్వామి వారి స్వరూపంగా గౌరవిం చాల్సిన చోట నిర్దాక్షిణ్యంగా ఈడ్చేస్తుంటారు. ఇదేమి దర్శనం. అంత దూరం నుంచి స్వామివారి దర్శనాన్ని ఓ జీవితానుభవంగా స్వీకరించాలని కంకణం కట్టుకున్న పేద వాడికి ఇదా మనమిచ్చేది?..

## వసతి కల్పన ఓ ప్రహసనమే!

తిరుమలలో వసతి కల్పన ఓ ప్రహసనంగా మారింది. ఇక్కడ సామాన్య భక్తులకు తిరుమలలో గది దొరకాలంటే గంటల తరబడి వేచిచూడాలి. ఆ గదుల ధరలు చూస్తే అమ్మో అనాల్సిందే. పోనీ తిరుమలలో రూమ్‌లు లేవా అంటే... ఖాళీగా ఉండే కాటేజ్‌లు అనేకం దర్శనం ఇస్తాయి. అవన్నీ వాడుకలో లేవని చెబుతుంటారు. నిత్యం లక్షలాది మంది భక్తులు వచ్చే తిరుమలలో వాడకంలో లేకపోవటం అంటే ఆశ్చర్యం వేయకమానదు. అలాంటి పరిస్థితి ఎందుకు వస్తుందో ఎవరికీ అర్థం కాదు. దళారులకు దొరుకుతున్న గదులు, సామాన్య భక్తులకు దొరకడం లేదంటే తప్పెవరిది. 'అంతయు నీవే హరి పుండరీకాక్ష' అంటూ స్వామివారి మీదకు నెట్టేద్దామంటారా.

## తీరు మారని ఉద్యోగులు!

తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో చాలామంది కారుణ్య నియామకాలకు సంబంధించిన వారే అనే వాదన వినిపిస్తోంది. దీంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ భక్తులతో ఏమాత్రం బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారు. క్యూలైన్ల నుంచే ఈ పోకడ కనిపిస్తోంది. దర్శనానికి వచ్చే భక్తులను ముందుగా పెద్ద గదుల్లోకి పంపిస్తారు. అక్కడకు పోయి కూర్చుంటే చక్కగా ఎస్వీబీసీ భక్తి ఛానల్ ప్రసారం అవుతూ ఉంటుంది. పెద్ద స్క్రీన్‌లో కనపడుతూ ఉంటుందే తప్ప, విందామంటే అస్సలు వినపడదు. అక్కడ కనీసం భక్తుల కోసం ఎవరూ కనిపించరు. దిక్కులేని వారికి దేవుడే దిక్కంటారు. స్వామి వారి కోసం వచ్చిన భక్తులకు ఆ గదుల్లో ఏ దిక్కూ కనిపించదు. పిల్లలు పాలకు ఏడ్చినా, షుగర్ పేషెంట్లు ఆకలితో అలమటించినా, వారికి తీరిన సమయంలో వడ్డన మొదలు పెడతారు. ఆ వడ్డన మరీ దారుణం. వడ్డన పూర్తి అయ్యేలోపు సగం ఆహారం నేలమీదే ఉంటుంది. అడుగడుగునా సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ, ఇవన్నీ ఇప్పటి దాకా పాలకమండలి కళ్ళ పడలేదో, పడనట్టు నటిస్తున్నారో తెలియని పరిస్థితి. అక్కడ నుంచి స్వామి వారి దర్శనానికి వదిలే తీరు జైలులో ఖైదీల పట్ల వ్యవహరించే తీరుకంటే దారుణంగా ఉంటుంది. ఇలాంటి విషయాల్లో భక్తుల సంయమనం ముఖ్యమే... కాదనలేం. కానీ అక్కడ మీ చావు మీరు చావండి అన్నట్లుగా ఎవ్వరూ కనిపించరు. గదుల్లోకి వెళితే ఎంత సమయం నిరీక్షించాలో అవగాహన ఉండదు. ఎప్పుడు వదులుతారో తెలియదు. అక్కడ నుంచి దర్శనానికి వెళితే ఇంతకు ముందు చెప్పినట్లు గోవింద నామస్మరణల బదులు... ఇంకేవో వినిపిస్తుంటాయి. స్వామిని చూసేలోపే లాగేస్తారు. ఈమధ్య ఓ మహిళా ఉద్యోగి భక్తులతో అనుచితంగా ప్రవర్తించిన తీరు గురించి ఎందరో భక్తులు ఆవేదనతో చెబుతున్నారు. అలాంటి మహిళా ఉద్యోగులు ఇంకెంతోమంది ఉన్నారు. వారికి ఎదురుచెప్పే సాహసం బహుశా ఎవ్వరూ చేయరని వారు భావిస్తున్నారేమో తెలియదు.

## సంప్రదాయాలను పరిరక్షించాలి!

స్వామి వారి దర్శనం అయ్యాక బయటకు వచ్చి ప్రసాదం కోసం వెళితే అక్కడ కూడా అదే పరిస్థితి. కవర్లు ఓ చోట కొనుక్కోవాలి, ప్రసాదం ఇంకో చోట తీసుకోవాలి. దర్శనానికి వెళ్ళే సమయంలో ఎంతమంది చిల్లర దగ్గర ఉంచుకుంటారు. దాని కోసం మళ్ళీ క్యూలలోకి వెళ్లాలంటారా..? స్వామి వారి భక్తుడి కోసం ఒక్క కవరును ఆలయం వారు ఇవ్వలేరా.?. ఆలోచించాల్సిన పరిస్థితి. చివరగా శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఏకాదశికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఏకాదశి నాడు ఉపవాసం చేసే సంప్రదాయం ఉంది. భక్తులు ఫలహారం తప్ప భోజనం చేయరు. అలాంటి సంప్రదాయాన్ని ప్రోత్సహించే ప్రయత్నం తిరుమలలో ఉన్నట్లు కనిపించదు. నిత్యాన్నదానంతో పాటు ఏకాదశి ఉపవాస దీక్షను కూడా ప్రోత్సహించే విధంగా ఏర్పాట్లు ఉండాల్సిన అవసరం ఉంది. ధర్మ పరిరక్షణ అంటే అదే కదా.

## మాటలు కాదు.. చేతలు కావాలి!

పరమ పవిత్రమైన తిరుమలలో అలిపిరి నుంచి ఆనంద నిలయం వరకు క్షేత్రస్థాయిలో అనేక అంశాలు మారాల్సిన సమయం ఆసన్నమైంది. కొంత కటువుగా అనిపించినా.. తిరుమలలో రోజురోజుకూ ప్రశాంతత లోపిస్తోందనేది నిర్వివాదాంశం. చాలా ఆలయాల్లో లాగే తిరుమలలో కూడా డబ్బులు ఉంటే చాలు ఏదైనా లభిస్తుందనే అహం కొందరిలో పెరుగుతోంది. ఈ క్రమంలో సాత్వికతకు చోటు దక్కడంలేదు. సంప్రదాయాలకు విలువ ఉండడం లేదు. పాలకమండలి సభ్యులకు, అధికారులకు ప్రత్యేక దర్శనాలు ఉంటాయి గనుక వాళ్లకు క్షేత్రస్థాయిలో జరిగే విషయాలు తెలిసే పరిస్థితి లేదు. గతంలో రాజులు రాజ్యంలోని పరిస్థితులను నేరుగా తనిఖీచేసి తెలుసుకున్నట్లు.. అప్పుడప్పుడూ పాలక మండలి సభ్యులు వాస్తవ విషయాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అయితే ఇప్పటి వరకు కొత్త పాలకమండలి తీసుకున్న నిర్ణయాలు మంచిగానే కనిపిస్తున్నాయి. ఈ స్ఫూర్తే భవిష్యత్‌లోనూ కొనసాగాలి. ఏళ్ళుగా పేరుకుపోయిన జాడ్యాలు దూరం కావాలి. అప్పుడే తిరుమల రూపురేఖలు పూర్తిగా మారడంలో తమవంతు పాత్ర పోషించిన వారవుతారు. ఈక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులకు, సిబ్బందికి పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. సైకాలజీ (మనోవైజ్ఞానిక శాస్త్రం) తరగతులు నిర్వహించి భక్తులతో ఎలా మెలగాలో.. ఆలయ సంప్రదాయాలను, ప్రశాంతతను ఏవిధంగా కాపాడాలో కూలంకుషంగా తెలియజేయాల్సి ఉంది. అలాగే భక్తులు కూడా ఎక్కడ ఎలా వ్యవహరించాలో బోర్డుల రూపంలో స్పష్టంగా అర్థమయ్యేలా వ్యక్తపరచాలి. అలా కాకుండా కేవలం గత పాలకులపై విమర్శలు చేస్తూ.. కొండపై జరిగే వ్యవహారాలను మరుగుపరిచే ప్రయత్నం చేస్తే.. మార్పు అనేది ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారడం ఖాయం. ఎప్పటిలాగే స్వామి సేవకోసం వచ్చే భక్తుల పాట్లు కొన సా....గడం తథ్యం. ఏదేమైనా వేంకన్న దయవల్ల అలా జరగకూడదని కోరుకుందాం. కొత్తపాలక మండలి ఈ దిశగా సంస్కరణలు తీసుకొస్తుందని ఆశిద్దాం..!

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com